ఐదుగురు ఏఈఈలకు అదనపు బాధ్యతలు

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: జలవనరుల శాఖలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఐదుగురు ఏఈఈలకు డీఈఈలుగా అదనపు (ఎఫ్‌ఏసీ) బాధ్యతలు అప్పగిస్తూ ఈఎన్‌సీ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కోడుమూరు ఎల్లెల్సీ సబ్ డివిజన్ ఏఈఈ మోహనరావుకు ఆలూరు జలాశయం (ఏబీఆర్) డీఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన గత రెండేళ్లుగా ఇక్కడ అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండగా, తిరిగి కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కర్నూలు ఎంఐ సబ్ డివిజన్ ఏఈఈ వై.నాగరాజుకు కర్నూలు ఎంఐ సబ్ డివిజన్ డీఈఈగా నియమించారు. నంద్యాల ఎస్సార్బీసీ-1 నాలుగో డివిజన్ ఏఈఈ కె.జ్యోతి గోరుకల్లు డీఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. హంద్రీనీవా సుజల స్రవంతి ఒకటో డివిజన్ డీఈఈ ఎన్.ప్రసాద్‌రావును కర్నూలు సబ్ డివిజన్ డీఈఈగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ డీఈఈగా ఉన్న రఘురామిరెడ్డి క్వాలిటీ కంట్రోల్ విభాగానికి బదిలీ కావడంతో ఖాళీగా ఉన్న పోస్టులో నియమించారు.

ముగిసిన బన్ని ఉత్సవాలు

హొళగుంద(హాలహర్వి), న్యూస్‌టుడే: ఆశ్వీజ మాసంలో మొదలైన దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాలు బుధవారం ఉత్సవ మూర్తులు నెరణికి గ్రామానికి చేరడంతో అట్టహాసంగా ముగిశాయి. ఈ నెల 7న కంకణధారణ కార్యక్రమంతో మొదలైన ఉత్సవాలు 12న దసరా రోజు రాత్రి జైత్రయాత్ర, 14న రథోత్సవం, 15న గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపే కార్యక్రమం, నృత్యాలు, కంకణ విసర్జన తదితర కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉత్సవమూర్తులు తరలింపుతో బన్ని ఉత్సవాలు ముగిశాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవ విగ్రహాలను దేవరగట్టు నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా తరలించారు. దీంతో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. ఊరేగింపు తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై బాలనరసింహులు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.




పూజలందుకున్న ఉత్సవమూర్తులు

ముక్కలలో దుఃఖం

ఖరీఫ్ కాలం ముగిసింది.. అరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చింది.. ఇలాంటి పరిస్థితిలో వచ్చిన అల్ప పీడనం అన్నదాతలకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.. ఏకదాటిగా కురుస్తున్న ముసురు వర్షాలకు కోత దశలో ఉన్న ఉల్లి కుళ్లిపోతోంది..

వి'పత్తి' వచ్చింది.. శాఖీయ దశలో ఉన్న మిరప కుళ్లుతోంది.. అధిక వర్షాలు కల'వరి'ంత తెచ్చిపెట్టింది.. మొక్కజొన్న మొలకెత్తుతోంది... అమ్మకానికి సిద్ధంగా ఉన్న రాసులను చినుకులు ముంచుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వివరించారు.

- 'ముసురు'కొన్న కష్టాలు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న శాస్త్రవేత్తలు



- న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం

ఫోన్ చేయండి.. సందేహాలు నివృత్తి చేసుకోండి

అధిక వర్షాలకు పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర సందేహాల నివృత్తికి నేరుగా ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఎమ్మిగనూరు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి తెలిపారు. కార్యాలయం పనివేళల(ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు)లో డాక్టర్ రాఘవేంద్రచౌదరి (77023 66115), డాక్టర్ మౌనిక (96032 93514), డాక్టర్ శ్రీచందన (94937 95145), డాక్టర్ నిరంజన్‌రెడ్డి (93460 45968) చరవాణి నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

పత్తి పత్తి పంట నీటి ముంపునకు గురైతే పిందెలు, కాయలు రాలిపోయి ఆకులు ఎర్రబారి వాడిపోతుంటాయి. పొలంలో నీటిని తీసేసి ఎండగా ఉన్నప్పుడు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లేదా 10 గ్రాముల యూరియాను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ప్రస్తుతం కాయకుళ్లు తెగులు బ్యాక్టీరియా, శిలీంధ్రాల ద్వారా వ్యాపించి పంటకు నష్టాన్ని కలుగజేస్తాయి. నివారణకు 0.1 మి.గ్రాముల స్ట్రెప్టోసైక్లిన్+3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్+కాసుగామైసిన్ 1.5 గ్రాముల లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

టమాటా ప్రస్తుతం టమాటా కోత దశలో ఉంది. అధిక వర్షాలకు పంటలో వేరుకుళ్లు, బ్యాక్టీరియల్ మచ్చలు ఎక్కువగా వచ్చే అవకాశముంది. నివారణకు ట్రైకోడెర్మావిరడి 5 గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్+కాసుగమైసిన్ 1.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి వేరు, కాయ తడిచే విధంగా చల్లుకోవాలి.

పొగాకు వర్షానికి పొగాకులో ఇనుపధాతు లోపం కనిపిస్తుంది. దీనివల్ల ఆకులు పసుపు రంగులోకి మారి పాలిపోతాయి. నివారణకు అన్నభేది 5 గ్రాములు, నిమ్మ ఉప్పు 1 గ్రాము లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ఉల్లిగడ్డ ఉల్లి పంట గడ్డ ఊరే దశలో ఉంది. పొలంలో అధికంగా నీరు నిల్వకుండా చూసుకోవాలి. వర్షాలకు ఉల్లిగడ్డకు కుళ్లు తెగులు వస్తుంది. కుళ్లు నివారణకు కార్బెండిజం+మాంకోజెబ్ 2 గ్రాములు లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 50 శాతం డబ్ల్యూపీ 2 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కంది కంది పూత దశలో ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు మారుకా మచ్చల పురుగు, పచ్చపురుగు ఆశిస్తుంది. నివారణకు ముందుగా వేపనూనె 5 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఉధృతిని బట్టి క్లోరోపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. వర్షాలకు పూత రాలకుండా బోరాన్ 1.5 గ్రాములు లేదా 19.19.19 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి చల్లుకోవాలి.

మొక్కజొన్న వర్షానికి మొక్కజొన్నలో తుప్పు తెగులు ఆశిస్తుంది. పంట పెరిగాక ఆకులపై పొక్కులు గోధుమ వర్ణం నుంచి నలుపు రంగుకు మారుతాయి. దీన్ని తుప్పు తెగులు అంటాం. నివారణకు మాంకోజెబ్ ఎకరానికి 500 గ్రాములు, 200 లీటర్ల నీటిలో కలిపి తెగులు తీవ్రతను బట్టి ఒకటి లేదా రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. ఇప్పటికే కోసిన మొక్కజొన్న దిగుబడులు తడవకుండా టార్పాలిన్లు కప్పి ఉంచాలి.

సెనగ శనగ పంటను అక్టోబరు 15 నుంచి నవంబరు 15 వరకు రబీలో విత్తుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. సెనగ అక్కడక్కడ వేసి రెండు వారాలైంది. అలాంటి పొలాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి.

ప్రధాన పంట	వరి	పొగాకు	కంది	మిరప	పత్తి	వేరుసెనగ	ఉల్లి	టమాట
సాగైంది (హెక్టార్లలో)	13,163.45	6,543.16	62,426.10	38,760.34	1,92,358.84	43,333.87	16,918.00	2,658.73

మిరప ప్రస్తుతం శాఖీయ దశలో ఉంది. వర్షాలకు కాయకుళ్లు, కొమ్మకుళ్లు తెగులు ఆశించే అవకాశముంది. నివారణకు టేబ్యుకొనజోల్+సల్ఫర్ 2 గ్రాములు లేదా డైఫెన్‌కొనజోల్ 0.5 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

వేరుసెనగ ప్రస్తుతం చేతికొచ్చిన వేరుసెనగ పంటను వర్షాలు తగ్గిన తర్వాత తొలగించాలి. ఇప్పటికే తొలగించిన పంటను కుప్పలుగా వేసి టార్పాలిన్లు కప్పి పెట్టుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చు.

జొన్న జొన్నలో వర్షానికి మొవ్వ ఈగ లేదా మొవ్వ తొలుచు పురుగు ఆశిస్తుంది. సుడి ఎండిపోయి మొక్కలు చనిపోతాయి. నివారణకు ల్యాండాసైహాలొత్రిన్ 1 మి.లీ. లేదా సైపర్‌మెత్రిన్ 1 మి.లీ. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

వరి ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అగ్గి తెగులు ఆశిస్తుంది. ఆకులపై నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడుతాయి. ఇవి ఆకులంతా వ్యాపించి ఆకులు ఎండి రాలిపోతాయి. నివారణకు ట్రైసైక్లాజోల్ 0.6 గ్రాములు లేదా కాసుగామైసిన్ 2.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ఆదేశాలు జారీ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: అల్ప పీడన ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్సు నిర్వహించి మాట్లాడారు. వర్షం తక్కువగా ఉందని నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ సూచించారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేకాధికారులు మండల కేంద్రాల్లో ఉండి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, నదీ పరీవాహక ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు వచ్చినా ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలన్నారు. ఇప్పటికే అన్ని డివిజన్ కేంద్రాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సంసిద్ధం చేస్తున్నామన్నారు. అధిక వర్షాలు కురవడం వల్ల ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు వచ్చే అవకాశం ఉంటుందని, అలాంటి ప్రాంతాలను తనిఖీ చేసి వర్షం నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు బయటకు పంపాలన్నారు. పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామాల్లో డ్రెయిన్లను శుభ్రం చేయించాలని ఆదేశించారు. సుంకేసుల, కేసీ కాలువ బండ్స్, వేదవతి నది, పెద్ద వాగులను గండ్లు పడకుండా సిమెంట్ ఇటుకలు సిద్ధంగా ఉంచుకోవాలని జలవనరుల శాఖ ఎస్‌ఈని ఆదేశించారు.



గ్రేడింగ్ కోసం ఉంచిన ఉల్లి కుళ్లుతోంది

ఆలస్యంగా సెలవిచ్చారు

- ఇబ్బందులుపడ్డ విద్యార్థులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: తుపాను కారణంగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున పాఠశాలలకు సెలవు ప్రకటించారు. అయితే బుధవారం ఎప్పటిలాగే పిల్లలను బడికి పంపిన తర్వాత 9:30 గంటల సమయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వాట్సాప్ ద్వారా సెలవు సమాచారం ఇచ్చారు. పిల్లలందరూ బడులకు చేరుకున్న 10:15 గంటల సమయంలో సెలవు ఇస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ ప్రకటించింది. మీ పిల్లలను వచ్చి తీసుకెళ్లండని చెప్పడంతో తల్లిదండ్రులు విద్యాశాఖ తీసుకున్న నిర్ణయంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై డీఈవో శామ్యూల్ మాట్లాడుతూ ఉదయమే సమాచారం ఇద్దామనుకున్నాం. పరిస్థితి తీవ్రంగా రావడంతో 8:30 గంటలకు కలెక్టర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకున్నాం.



వర్షంలోనే ఇంటికెళ్తున్న విద్యార్థులు

మద్యం సీసాపై ఖద్దరు ముద్ర

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే:

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మద్యం దుకాణ అనుమతులు దక్కించుకున్న తెలంగాణ రాష్ట్ర వ్యాపారులకు జిల్లా నేతలు చుక్కలు చూపిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 204 మద్యం దుకాణాలు కేటాయించిన సంగతి తెలిసిందే. తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తులు కర్నూలు, కోడుమూరు, డోన్, కోవెలకుంట్ల, శ్రీశైలం ఇతరత్రా స్టేషన్ పరిధిలో సుమారు 45 దుకాణాలు దక్కించుకున్నారు. వాటిని ఏర్పాటు చేసుకునేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలను ఆశ్రయించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. వారి అనుమతి తీసుకోనిదే దుకాణాలు ఏర్పాటు చేసుకోవడం సాధ్యపడటం లేదు. ప్రజాప్రతినిధులను సంప్రదించిన తెలంగాణ వ్యాపారులకు పలు ఆంక్షలు విధిస్తూ దౌర్జన్యం చేస్తున్నారు. వ్యాపారంలో 30 నుంచి 70 శాతం వరకు భాగస్వామ్యం ఇవ్వాలని హుకుం జారీ చేస్తున్నారు. గద్వాల జిల్లాకు చెందిన ముఖ్యనేతలు కర్నూలు జిల్లా నేతలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.



ఎక్కడ ఎలాంటి ఆంక్షలు

- కోడుమూరు స్టేషన్ పరిధిలో ఓ నాయకుడి దౌర్జన్యం కారణంగా పలువురు తెలంగాణవాసులు దుకాణాలు ఏర్పాటు చేసుకోలేదని తెలిసింది. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారి సుంకేసుల పరిధిలో దుకాణం పెట్టుకునేందుకు అనుమతించకపోవడంతో ఆయన మరో గ్రామంలో ఏర్పాటు చేసుకున్నారని తెలిసింది. ఓ తెలంగాణ వ్యాపారికి కోట్ల బాసటగా నిలవడంతో ఏర్పాటు చేసుకున్నారు.
- నగర శివారులో రెండు మద్యం దుకాణాలను దక్కించుకున్న ఓ వ్యాపారి బుధవారం తన దుకాణాన్ని తెరిచేందుకు వీలుగా ఓ చోట బ్యానర్లు కడుతుండగా ఆయన్ను కొందరు అడ్డుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధితో మాట్లాడుకోవాలని సూచించారు. దీంతో ఆయన్ను 'గౌరవంగా' ఆ ప్రజాప్రతినిధి తరఫున వ్యవహారాలు చక్కబెట్టే పెద్దల దగ్గరకు తీసుకెళ్లారు. వాటా ఎంతిస్తారన్న విషయాన్ని తేల్చాలని సూచించారు. ఆ విషయం తేలకుండా దుకాణం తెరవలేరని, ఒకవేళ తెరిచినా వ్యాపారం చేసుకోలేరని సున్నితంగా హెచ్చరించడంతో ఆయన దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఆయన 30శాతం వాటా అడిగినట్లు ప్రచారం జరుగుతోంది.

- కర్నూలులో అనుమతి దక్కించుకున్న కోడుమూరు మాజీ ఎమ్మెల్యే అనుచరుడిని ప్రత్యర్థి వర్గం ఇబ్బంది పెట్టినట్లు తెలిసింది.
- దుకాణం పెట్టాలంటే 30 శాతం భాగస్వామ్యం లేదా.. నెలకు రూ.లక్ష ఇవ్వాలని ఎమ్మిగనూరు పరిధిలో అనుమతి దక్కించుకున్న ఓ వ్యాపారిని ఓ నాయకుడు హెచ్చరించారు. ఎమ్మిగనూరులో అనుమతి దక్కించుకున్న తెలంగాణ వ్యాపారికి ఇచ్చిన అడ్వాన్సు వెనక్కి ఇప్పించడంతో వెళ్లిపోయారు.

గంధరగోళం

జిల్లాలో కొత్త మద్యం దుకాణాలు బుధవారం తెరుచుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 75 శాతం మద్యం వ్యాపారులు ఐఎంఎల్ డిపో మద్యం పొందారు. ధరల విషయంలో కొంత గందరగోళం నెలకొంది. కర్నూలు జిల్లాలో బుధవారం సాయంత్రం వరకు 65 మంది అనుమతిదారులు డిపోలో మద్యం తీసుకున్నారని తెలిసింది. కొందరు మద్యం వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకునే పనిలోనే ఉన్నారు. రూ.99 మద్యం సీసాలు వచ్చేందుకు మరో వారం రోజులు, పూర్తి స్థాయిలో అన్ని బ్రాండ్లు వచ్చేందుకు మరో 10 రోజులు సమయం పట్టనుంది.



పోలీసు శాఖలో భారీగా బదిలీలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఎట్టకేలకు జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలకు స్థాన చలనం కలిగింది. 122 మంది కానిస్టేబుళ్లు, 82 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 24 మంది ఏఎస్సైలను బదిలీ చేస్తూ బుధవారం జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఉత్తర్వులు జారీ చేశారు. 10 మంది కానిస్టేబుళ్లు, 34 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 9 మంది ఏఎస్సైలను అటాచ్‌మెంట్ ప్రాతిపదికన వేర్వేరు స్థానాలకు కేటాయించారు. లాంగ్ స్టాండింగ్, విజ్ఞాపన, ఆరోపణ అంశాలను పరిగణనలోకి తీసుకుని బదిలీ చేసినట్లు తెలిసింది. అధిక శాతం మంది ఉద్యోగులను ప్రస్తుత సబ్ డివిజన్ పరిధిలోనే బదిలీ చేశారు.

చెరువు చెడింది.. వరద భయపెడుతోంది

- ఐదేళ్లు పట్టించుకోని గత వైకాపా ప్రభుత్వం
- నిధులివ్వక మరమ్మతులూ చేయలేని దుస్థితి

నీటి వనరులు నిండా ప్రవహిస్తున్నాయి.. చెరువుల్లోకి నీరు చేరుతోంది.. అల్ప పీడన ప్రభావంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.. భారీ వర్షాలతో ఎక్కడ చెరువు కట్టలు తెగిపోతాయోనని కర్షకులు ఆందోళన చెందుతున్నారు. వీటి నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం గాలికొదిలేసింది. ఐదేళ్లలో ఐదు పైసలివ్వలేదు.. చిన్ననీటి పారుదల శాఖ అధికారులు పలుమార్లు నిధుల కోసం ప్రతిపాదనలు చేసినా.. జగన్ సర్కారు పైసా విదల్చలేదు. కట్టలు బలహీనంగా మారాయి.. ముళ్ల పొదలు పెరిగాయి.. తూములు తెరిచే పరిస్థితి లేకుండా పోయింది.

- న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, పత్తికొండ



ఉపాధి పనుల్లో భాగంగా తవ్విన పక్కనే వేసిన మట్టి

99 తటాకాలనూ వదిలేశారు

106 చెరువుల్లోకి కృష్ణా జలాలు మళ్లించాలని తెదేపా హయాంలో నిర్ణయించారు. తొలి విడత 68 పనులకు శ్రీకారం చుట్టారు. అంతలోనే వైకాపా గద్దెపై కూర్చొంది. మరో 11 చెరువులను చేర్చి అంచనాలు పెంచారు. నిర్మాణ వ్యయం కాస్త రూ.254 కోట్లకు చేరింది. పనులు మాత్రం పూర్తిచేయలేదు.

వరదొస్తే కట్టలు తట్టుకోగలవా

- ఉమ్మడి జిల్లాలో చెరువులు, బోర్లపై ఆధారపడి చాలా ప్రాంతాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 100 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న చెరువులు 60, ఆలోపు ఆయకట్టు ఉన్నవి 250 ఉన్నాయి. మొత్తం 310 చెరువుల్లో 4,411 ఎంసీఎఫ్టీల నీటి సామర్థ్యం ఉంది.
- నంద్యాల జిల్లాలోని 25 మండలాల్లో 100 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న చెరువులు 105 ఉన్నాయి. వంద ఎకరాల్లోపు ఆయకట్టు ఉన్నవి 158 ఉండగా మొత్తం 263 చెరువుల్లో 3,923 ఎంసీఎఫ్టీల నీటి సామర్థ్యం ఉంది.

జిల్లా	చెరువులు	ఆయకట్టు
కర్నూలు	310	33,113
నంద్యాల	263	48,516

రూ.6 కోట్లు మింగేశారు

అమృత్ సరోవర్ పథకం కింద ఉపాధిహామీ నిధులతో 2022లో కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 75 చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. మొత్తం రెండు విడతల్లో వీటిని బాగు చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఒక్కో చెరువుకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు చొప్పున మొత్తం రూ.6 కోట్లు ఖర్చు చేశారు. పథకంలో భాగంగా అన్నిపనులు పూర్తి చేశామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అవేమీ కనిపించడం లేదు. చాలా చెరువుల్లో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. చెరువు కట్టలపై మొక్కలు జాడలేదు. ఆత్మకూరు, నంద్యాల, పాణ్యం మండలాల్లో చెరువుల్లో వెయ్యి క్యూబిక్ మీటర్ల పూడిక తీసినట్లు దస్త్రాల్లో నమోదు చేశారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన పనుల్లో పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయి.

జపాన్ సహకారం నీళ్లపాలు

జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేటివ్ ఏజెన్సీ సౌజన్యంతో 14 చెరువుల మరమ్మతులు, అభివృద్ధికి రూ.7.20 కోట్లు మంజూరయ్యాయి. ఐదు చోట్ల పనులు పూర్తవ్వగా తొమ్మిది అసంపూర్తిగా వదిలేశారు.

జగన్ మొండిచెయ్యి

- ఆంధ్రప్రదేశ్ సమగ్ర సాగునీటి వ్యవసాయ పరివర్తన పథకం (ఏపీఐఐఏటీపీ) కింద ఉమ్మడి జిల్లాకు నాలుగేళ్ల కిందట రూ.52.04 కోట్లు మంజూరయ్యాయి. 34 ఇరిగేషన్ చెరువులకు వీటిని కేటాయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి 50 శాతం నిధులు భరించే విధంగా ప్రాజెక్టు మంజూరైంది. కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేసింది. అప్పటి వైకాపా ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయకపోవడంతో పనులు పూర్తి కాలేదు.
- రుద్రవరం మండలంలో రెండు చెరువులు, బండిఆత్మకూరు, శిరివెళ్ల, ఉయ్యాలవాడ, గడివేముల, జూపాడుబంగ్లా, డోన్ మండలాల్లో ఒక్కోటి చొప్పున తటాకాలకు మరమ్మతులు జరుగలేదు.
- కర్నూలు జిల్లాలోని దేవనకొండ మండలంలో 2, ఆదోని 3, పత్తికొండ, హొళగుంద, ఆస్పరి, సి.బెళగల్, కౌతాళం, హాలహర్వి మండలాల్లో ఒక్కో చెరువుల అభివృద్ధి జరిగే అవకాశం లేకుండాపోయింది.
- జూపాడుబంగ్లాలోని కరివేముల, తంగడంచ, అవుకు మండలంలోని ఉప్పలపాడు, దేవనకొండ మండలంలోని సేతలమర్రి, పత్తికొండలోని ఊరి చెరువులో పనులే జరగలేదు. మిగతా చోట్ల 40 శాతమే జరిగాయి.

పీజీ స్పాట్ అడ్మిషన్లు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి పీజీలో ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు చేపట్టినట్లు ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ పీజీసెట్-24లో అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 17, 18 తేదీల్లో జరగనున్న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను ఆసక్తి ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉర్దూ వర్సిటీలో...

డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీలో పీజీ కోర్సుల్లో కన్వీనర్ కోటా కింద సీట్ల భర్తీకి ప్రక్రియ ప్రారంభించినట్లు రిజిస్ట్రార్ లోకనాథ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏలో ఇంగ్లిష్, ఎకనామిక్స్, ఉర్దూ, ఎమ్మెస్సీలో కంప్యూటర్ సైన్సు, బోటనీ, జువాలజీ, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీలో స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ నెల 17 నుంచి 24వ తేదీలోపు సరైన పత్రాలతో వర్సిటీలోని పరిపాలన భవనంలో సంప్రదించాలన్నారు.



నైపుణ్యాల తోట.. ఉపాధికి బాట

- పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం
- అగ్రశ్రేణి సంస్థల్లో వృత్తి శిక్షణకు అవకాశం



డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకుంటే మెరుగైన ఉపాధి, ఉద్యోగావకాశాలు పొందొచ్చు. నిరుద్యోగ యువత ఉజ్వల భవితను పొందాలనే సదాశయంతో కేంద్రం పీఎం ఇంటర్న్‌షిప్ పథకాన్ని తెచ్చింది. అగ్రశ్రేణి సంస్థల్లో శిక్షణ పొంది నైపుణ్యాలు పెంచుకునేందుకు ఈనెల 12 నుంచి పేర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో, కర్నూలు క్లస్టర్ విశ్వవిద్యాలయం పరిధిలో కళాశాలలు, ఐటీఐ కళాశాలలు, ఉన్నత పాఠశాల విద్య, ఇంటర్, డిప్లొమా చదివే దాదాపు 60 వేలకు పైగా విద్యార్థులకు ఇదొక సువర్ణావకాశమే.

ఏయే పరిశ్రమల్లో...?

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వంద మంది కంటే ఎక్కువ ఉపాధి కల్పిస్తున్న మధ్యతరహా పరిశ్రమలు దాదాపు 50 వరకు ఉండగా, పెద్ద తరహా పరిశ్రమలు 25 వరకు ఉన్నాయి. ఇలాంటి చోట విద్యార్థులకు పలు అంశాల్లో నైపుణ్యాలు పెరిగేలా అవగాహన కల్పిస్తారు.

అర్హులెవరంటే..?

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకునే వారు పదో తరగతి, ఇంటర్, బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ పూర్తి చేసి ఉండాలి. ఐటీఐ, డిప్లొమా సైతం పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పథకానికి 21 నుంచి 24 ఏళ్ల లోపు నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. కేంద్ర మంత్రిత్వ శాఖ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.పిఎం ఇంటర్న్‌షిప్.ఎంసీఏ.జీవోవి.ఇన్‌ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలి. ఆధార్ అనుసంధానమైన చరవాణి నంబరు, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అభ్యర్థి ప్రొఫైల్‌లో ఈకేవైసీ పూర్తి చేయాలి. వ్యక్తిగత వివరాలు, విద్యార్హత, చిరునామా, కేటగిరీ, తదితర వివరాలు ఆధార్‌తో అనుసంధానం చేసిన చరవాణి నంబరు, ఈ మెయిల్ ఐడీ, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలి. ఎటువంటి రిజిస్ట్రేషన్ ఫీజు ఉండదు.

ఎంపిక ప్రక్రియ ఇలా..

పీఎం ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి ఆబ్జెక్టివ్ పరీక్ష నిర్వహిస్తారు. అర్హులైన అభ్యర్థులు పీఎం ఇంటర్న్‌షిప్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులు పూర్తి వివరాలను నమోదు చేయాలి. ఎంపికైన వారికి వారు ఎంచుకున్న పరిశ్రమలకు సంబంధించి నైపుణ్యాలను నేర్పిస్తారు. అర్హత సాధించిన వారు ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా ప్రధానమంత్రి సురక్ష బీమా కవరేజ్ కూడా లభించే అవకాశం ఉంది.

వేటిని అందిస్తారంటే..

పీఎం ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, ఆయిల్, గ్యాస్ అండ్ ఎనర్జీ, మైనింగ్, టెలికాం, రిటైల్, సిమెంట్, బిల్డింగ్ మెటీరియల్స్, ఫార్మాస్యూటికల్, ఏవియేషన్, మాన్యుఫ్యాక్చరింగ్, అగ్రికల్చర్, జెమ్స్ జ్యువెలరీ, ట్రావెల్ హాస్పిటాలిటీ వంటి రంగాల్లో ఇంటర్న్‌షిప్ అందిస్తారు. ఎంపికైన వారికి 12 నెలల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు వన్‌టైం(ఏక కాల) గ్రాంటు కింద రూ. 6వేలతో పాటు ప్రతి నెలా ప్రభుత్వం రూ. 4,500లు, కంపెనీ రూ.500ల చొప్పున డీబీటీ ద్వారా క్రెడిట్ చేస్తారు. ఈ లెక్కన ఏడాదికి మొత్తం రూ. 66వేలు పొందే అవకాశం ఉంది.

ఏయే పత్రాలు కావాలంటే..?


ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, విద్యార్హత, నేటివిటీ సర్టిఫికెట్ ఉండాలి. అయిదింటిలో ఏదైనా ఒకటి ఎంపిక చేసుకోవచ్చు. ఎంపికైతే మీ ఈ మెయిల్‌కు ఆఫర్ లెటర్ వస్తుందని, అధికారిక వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోనే వీలు కూడా ఉందని అధికారులు చెబుతున్నారు.

● దరఖాస్తు ప్రారంభం: అక్టోబరు 12న ● చివరి తేదీ: ఈ నెల 25వ తేదీ లోపు ● దరఖాస్తు దారుల జాబితా విడుదల: ఈ నెల 26వ తేదీ ● ఎంపిక ప్రక్రియ: ఈ నెల 27 నుంచి నవంబరు 7 వరకు ● అభ్యర్థి అంగీకారానికి గడువు: నవంబరు 8వ తేదీ నుంచి 15వ తేదీ లోపు ● ఇంటర్న్‌షిప్ ప్రారంభం: డిసెంబరు 2 ● సందేహాల నివృత్తికి: హెల్ప్ లైన్ నంబరు: 1800116090కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చు



తర్ఫీదు పొందుతున్న యువత

సువర్ణఅవకాశమే -డా.జి.రామకృష్ణ, నోడల్ అధికారి, రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు



నిరుద్యోగ యువతకు పీఎం ఇంటర్న్‌షిప్ పథకం సువర్ణ అవకాశమే. డిగ్రీ, డిప్లొమా తదితర కోర్సుల్లో అర్హులైన వారిని ఎంపిక చేసి జాతీయస్థాయిలో వివిధ అగ్రశ్రేణి సంస్థల్లో నైపుణ్యాలు పెంపొందేలా ప్రోత్సహిస్తారు. విద్యార్థులు అభిరుచికి అనుగుణంగా శిక్షణ పొందే వీలుంది. శిక్షణాకాలంలో మెలకువలు, నైపుణ్యాలు పెంపొందించుకోవడం వల్ల వారి భావి ఉద్యోగ జీవితానికి గట్టి పునాది పడుతుంది. ఆసక్తి ఉండి అర్హత ఉన్న వారు వినియోగించుకోవాలి.

ఇసుకంతైనా కదలని పనులు

- నాలుగు నెలలుగా నిలిచిన వైనం
- ఉమ్మడి జిల్లాలో పురపాలక సంఘాల్లో నిర్మాణాల పరిస్థితి

ఎమ్మిగనూరు, ఆదోని పురపాలక సంఘం, న్యూస్‌టుడే: పురపాలక సంఘాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయిస్తున్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధి పనులు మంజూరుకు కౌన్సిల్‌లో ఆమోద ముద్ర వేయించినా ఫలితం లేకుండా పోతోంది. పనులు చేపట్టేందుకు ఆరు నెలలుగా ఇసుక లభ్యం కాకపోవడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు, ఆదోని, డోన్, కర్నూలు, నంద్యాల, నందికొట్కూరు పురపాలక సంఘాల్లో 15వ ఆర్థిక, సాధారణ నిధుల కింద ప్రతి మున్సిపాలిటీలో రూ.2 కోట్లు నుంచి రూ.10 కోట్లు మేరకు పనులు చేపట్టేందుకు టెండర్లు పిలిచారు. పనులు దక్కించుకున్న గుత్తేదారులు ఆరు నెలలుగా ఇసుక కొరతతో పనులు నిలిపేశారు. కొన్ని పురపాలకల్లో రోడ్లు, వంతెనలు తవ్వి వదిలేశారు. ప్రతి మున్సిపాలిటీలో 10 నుంచి 50 పనులు ఇసుక కొరతతో నిలిచిపోయాయి. పనులపై అధికారులు, గుత్తేదారులు తలోదారి వ్యవహరిస్తున్నారు. పురపాలక సంఘాల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచినా కొన్ని పురపాలకల్లో అభివృద్ధికి అడుగులు పడలేదు.

పురపాలక	నిధులు (రూ.కోట్ల)	నిలిచిన పనులు
ఎమ్మిగనూరు	4	38
ఆదోని	5	27
నంద్యాల	7	42
కర్నూలు	11	55

రెండు నెలలుగా నిలిచాయి

ఇది ఎమ్మిగనూరు పట్టణం రామయ్య కొట్టాలలోనిది. ఇక్కడ రూ.8 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. కంకర, డస్ట్ వేశారు. రెండు నెలలుగా ఇసుక లేక వదిలేశారు. గుత్తేదారుడు బయట ఇసుక కొనుగోలుకు ప్రయత్నించగా రూ.26 వేలు ఒక టిప్పర్ ఉండటంతో పనులు చేయడం లేదు. ప్రజలు దీనిపై ఫిర్యాదు చేసినా ఇసుక కొరత తీవ్రంగా ఉందని గుత్తేదారు చెబుతున్నారు.

పూర్తికాని దుకాణ సముదాయం

ఇది ఆదోని పురపాలక సంఘంలో రూ.32 కోట్లతో నిర్మిస్తున్న వాణిజ్య దుకాణ సముదాయం. ప్రధానంగా వ్యాపారాల నుంచి గుడిసెల వేలం పాడటంతో 43 మంది వ్యాపారులు రూ.4 కోట్లు వరకు చెల్లించారు. ఇసుక కొరతతో ఆరు నెలలుగా పనులు ముందుకు సాగడం లేదు. రూ.లక్షలు చేసి పెట్టుబడులు పెట్టామని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





మెడికల్ వివాదం పరిష్కారం

కర్నూలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఓ ఉద్యోగి, ఆసుపత్రి మధ్య నెలకొన్న వివాదాన్ని జిల్లా ప్రజాప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ పరిష్కరించింది. నంద్యాల జిల్లావాసి అనారోగ్యంతో సన్‌షైన్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందారు. ఆసుపత్రిలో మెడికల్ రీయింబర్స్‌మెంట్ ఉందని చెప్పడంతోనే ఆయన అందులో చేరారు. చికిత్స పూర్తయిన తర్వాత రూ.4,17,611 బిల్లులు పొంది ప్రభుత్వానికి ఫీజు రీఎంబర్స్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకోగా సదరు ఆసుపత్రికి అనుమతి పునరుద్ధరించలేదంటూ ఏపీ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ-ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్‌వారు బిల్లులను తిరస్కరించారు. దీంతో ఆయన జిల్లా ప్రజాప్రయోజన సేవల శాశ్వత లోక్‌అదాలత్‌లో ఫిర్యాదు చేశారు. శాశ్వత లోక్‌అదాలత్ అధ్యక్షుడు వెంకటహరినాథ్, సభ్యులు శివశంకర్‌రెడ్డి, డి.రాజుబాబు ఇరువురికి నోటీసులు జారీ చేసి పిలిపించి చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చేసి రాజీ కుదిర్చారు. ఆసుపత్రి నిర్వాహకులు రూ.3 లక్షలు చెల్లించడంతో కేసును ఉపసంహరించుకున్నారు.

ఇద్దరికి ఫారిన్ సర్వీస్ కింద మరో ఏడాది గడువు పొడిగింపు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ, బనవాసిలో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు అనిల్ కిరణ్, ఎస్.వీరేష్ ఫారిన్ సర్వీస్ కింద మరో ఏడాదిపాటు పని చేసేందుకు గడువు పొడిగిస్తూ రాష్ట్ర పశు సంవర్ధక శాఖ కార్యదర్శి ఎం.ఎం. నాయక్ బుధవారం జీవో జారీ చేశారు.

వర్షాలకు చెదురుతున్న దారులు

వర్షాలు పల్లెలను భయపెడుతున్నాయి. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామం నుంచి చిన్నచొన్నగిరికి వెళ్లే రహదారిలోని వాగుపై ఉన్న కల్వర్టు పైపు ఊడిపోయి బయటకు వచ్చింది. తరుచూ కురుస్తున్న వర్షాలకు కల్వర్టు కుంగిపోయింది. నేటికీ మరమ్మతు పనులు చేపట్టలేదు. వాగు ఉద్ధృతికి కల్వర్టుకు ఓ వైపు ఉన్న పైపులు కొట్టుకుపోయాయి. రహదారిలో వంతెన ఒక వైపు కూలడంతో భారీ వాహనాలు వెళ్లేందుకు వీల్లేకుండా పోయింది. దెబ్బతిన్న వంతెనను బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, తుగ్గలి



రసవత్తరంగా నర్సెస్ అసోసియేషన్ ఎన్నికలు

ఓ ప్యానల్‌కు ఎన్జీవోల మద్దతు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికల మాదిరిగా రసవత్తరంగా మారాయి. మంజులాదేవి ప్యానల్, శాంతిభవాని ప్యానల్ బుధవారం సర్వజన వైద్యశాలలో ఎన్నికల అధికారి చెన్నమ్మ ఆధ్వర్యంలో నామపత్రాలు దాఖలు చేశారు. ఈ నెల 23న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ స్టాఫ్‌నర్సులు 321 మంది ఉన్నారు. వీరందరూ ఓటు వేయనున్నారు. మంజులా ప్యానల్‌లో అధ్యక్షురాలిగా పి.ఆదిలక్ష్మి, కార్యదర్శిగా డి.మంజులాదేవి, కోశాధికారిగా విజయమ్మ, ఉపాధ్యక్షురాలిగా శ్రీదేవి, ఐదుగురు ఈసీ సభ్యులుగా పోటీలో ఉన్నారు. శాంతిభవాని ప్యానల్‌లో అధ్యక్షురాలిగా ఎం.శీల, కార్యదర్శిగా బంగారి, కోశాధికారిగా లక్ష్మీనరసమ్మ, ఉపాధ్యక్షురాలిగా శాంతిభవాని, మరో ఐదుగురు ఈసీ సభ్యులుగా పోటీలో ఉన్నారు. ప్రధానంగా అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి, ఉపాధ్యక్షుల పదవులకు పోటీ పడుతున్నారు.

పోటాపోటీగా ప్రచారం

ఎన్నికల ప్రక్రియ ప్రారంభించిన నాటి నుంచి పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. ప్యానల్ తరపున పెద్దఎత్తున నజరానాలు ఇస్తున్నారు. గతంలో ఎప్పుడూ ఎన్జీవోలు జోక్యం చేసుకునేవారు కాదు, కానీ ఈసారి ఈ ఎన్నికల్లో శాంతిభవాని ప్యానల్‌కు ఎన్జీవోలు బహిరంగంగా మద్దతు ఇవ్వడంతోపాటు జిల్లా అధ్యక్షుడు, తాలూకా అధ్యక్షులకు ఒక్కొక్కరికీ 5 ఓట్ల లెక్కన కేటాయించి వేయించే బాధ్యతను ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న నాయకులకు అప్పగించారు. దీంతో అప్రమత్తమైన మంజులాదేవి ప్యానల్ కూడా పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. ఇరువైపులా ఓట్లు వేసేలా తాయిలాలు కూడా ఇస్తున్నారనే ప్రచారం ఉంది. రాబోయే వారం రోజులు సర్వజన ఆసుపత్రి స్టాఫ్‌నర్సుల యూనియన్ ప్రచారానికి వేదిక కానుంది.

ముంచుకొచ్చిన తుపాను..

- జాగ్రత్తలతో ప్రమాదాల నివారణ
- మూడు రోజులపాటు భారీ వర్ష సూచన

అప్రమత్తతే ఆయుధం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తుపాను హెచ్చరికను జారీ చేసిన నేపథ్యంలో రాయలసీమలో సుమారు మూడు రోజులపాటు భారీ వర్ష సూచన ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలు, విద్యుత్తు వినియోగదారులు, రైతులు, పారిశ్రామిక కార్మికులు, ఇతరులు తుపాను కారణంగా విద్యుత్తు ప్రమాదాలపై అవగాహన పెంచుకొని జాగ్రత్తలు పాటించాలని కర్నూలు, నంద్యాల జిల్లాల విద్యుత్తు శాఖ (ఆపరేషన్స్ సర్కిల్) ఎస్‌ఈలు ఎం.ఉమాపతి, జి.సుధాకర్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా కంట్రోల్ రూంలు, డివిజన్ల పరిధిలో అత్యవసర సహాయక చర్యలు, తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సరఫరా పునరుద్ధరణ పనులను వేగవంతం చేయడానికి అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు హెడ్‌క్వార్టర్‌లో విధులు నిర్వహించాలని, సెలవులు పెట్టరాదని సూచించారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యుత్తు సమస్యలపై టోల్‌ఫ్రీ నంబరు 1912, 18004251555333కు సమాచారం అందించాలని, ఏపీఎస్పీడీసీఎల్ సంస్థ వాట్సాప్ నంబరు 9133331912కు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోచ్చని సూచించారు.



భద్రత నియమాలు ఇలా

- అధిక వర్షాలు, ఈదురుగాలులు అధికంగా వస్తున్నప్పుడు నీటి నిల్వ అధికంగా ఉన్నచోట విద్యుత్తు స్తంభాలను తాకరాదు. వాటి సమీపంలో ఉండరాదు.
- రైతులు తమ పొలాల్లో విద్యుత్తు మోటార్ల వద్ద జాగ్రత్తలు పాటించాలి. తడి చేతులతో మోటార్లను ఆన్, ఆఫ్ చేయడం చేయరాదు. అతుకులు వేసిన తీగలను మోటార్ల కనెక్షన్లకు ఉపయోగించొద్దు. ఐఎస్ఐ తీగలను వాడుకోవాలి.
- ఎక్కడైనా విద్యుత్తు తీగలు తెగి పడి ఉంటే వాటికి తాకొద్దు. వెంటనే సంబంధిత విద్యుత్తు సిబ్బందికి తెలియజేయాలి.
- రైతులు తమ పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలు ఒరుగడం, విరగడం గమనిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించి ప్రమాదాలు జరుగకుండా చూడాలి.
- ఉద్యానాలు, మైదానాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభాలు ముట్టుకోవద్దు.
- వర్షం పడేప్పుడు విద్యుత్తు స్తంభాలు తాకరాదు. తీగలకు తగులుతున్న చెట్లను, వాటి కొమ్మలను పట్టుకోవద్దు. అలాంటి సమస్యలుంటే అధికారులకు సమాచారం అందించాలి.
- ఇళ్లలో గోడలపై నిమ్ము ఏర్పడినప్పుడు లేదా తడిచిన స్విచ్ బోర్డు ఉన్నప్పుడు తడి చేతులతో ఆన్ చేయరాదు. ఇంటి బయట ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు వర్షాలకు తడవకుండా చర్యలు తీసుకోవాలి. వీధి స్తంభం నుంచి ఇళ్లకు ఇచ్చే సర్వీసు తీగలకు అతుకులు లేకుండా చూసుకోవాలి.
- ఇళ్లలో విద్యుత్తు పరికరాలను తడి చేతులతో తాకరాదు.

కర్నూలు జిల్లాలో కంట్రోల్‌రూం ఏర్పాటు

ప్రజల సౌకర్యార్థం అతి భారీ వర్షాల హెచ్చరిక జారీ దృష్ట్యా విద్యుత్తు సమస్యలపై కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాలు, డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరా, అంతరాయం, ఇతర సమస్యలపై పర్యవేక్షించనున్నట్లు అధికారులు తెలిపారు.

కంట్రోల్ రూం	చరవాణి నంబరు
కర్నూలు (జిల్లా కంట్రోల్ రూం)	7382614308
కర్నూలు డివిజన్	08518-221919
ఎమ్మిగనూరు డివిజన్	7382787703
ఆదోని డివిజన్	7382614098

నంద్యాల జిల్లాలో

కంట్రోల్ రూం	చరవాణి నంబరు
నంద్యాల డివిజన్	7382788257
ఆత్మకూర్ డివిజన్	7386772611
డోన్ డివిజన్	7382788257

కేంద్రం ఆరు రబీ పంటలకు మద్దతు ధర పెంపు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం రైతులకు శుభవార్త తెలిపింది. 2025-26 సీజన్‌లో ఆరు రబీ పంటలకు కనీస మద్దతు ధర పెంచుతున్నట్లు ప్రకటించింది. శనగలకు మద్దతు ధర క్వింటాల్ రూ. 5,650కు పెంచింది. ఇది గతంలో రూ. 5,440 ఉండేది. కందులు క్వింటాల్ రూ. 6,425 నుంచి రూ. 6,700కు పెంచింది. ఆవాలు రూ. 5,650 నుంచి రూ. 5,950 కాగా, కుసుమలు క్వింటాల్ రూ. 5,800 నుంచి రూ. 5,940కు పెంచారు. గోధుమలు క్వింటాల్ రూ. 2,275 నుంచి రూ. 2,425కు, బార్లీ క్వింటాల్ రూ. 1,850 నుంచి రూ. 1,980కు పెంచారు. కేంద్రం రబీ పంటలకు మద్దతు ధర పెంచడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉల్లి క్వింటాల్ గరిష్ఠ ధర రూ.4,088

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పంట ఉత్పత్తుల ధరల వివరాలు ఇలా ఉన్నాయి. మార్కెట్‌కు 8,285 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా క్వింటాల్ కనీస మద్దతు ధర రూ. 495, మధ్యస్థం రూ. 3,189, గరిష్ఠం రూ. 4,088 పలికింది. వేరుసెనగ కాయలు క్వింటాల్ రూ. 6,680, పూల విత్తనాలు రూ. 5,409, ఆముదాలు రూ. 6,025, మొక్కజొన్నలు రూ. 2,191, కందులు రూ. 9,019, ఎండుమిర్చి రూ. 8,499, కొర్రలు రూ. 3,029, మినుములు రూ. 6,719, సోయాబీన్స్ రూ. 4,129, సజ్జలు రూ. 2,019కు వ్యాపారులు ఈ-నామ్ పద్ధతిలో కొనుగోలు చేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి పేర్కొన్నారు. బుధవారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ, రాష్ట్ర వ్యవసాయ విస్తరణ సంస్థల అధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని రైతులు, సహకార సంఘం సీఈవోలకు సమగ్ర పోషక యాజమాన్యం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లా సహకార సంఘం అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ.. రెండు వారాల పాటు నిర్వహించే శిక్షణ తరగతుల్లో పోషకాల గురించి సమగ్రంగా తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుజాతమ్మ, ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత, నాగేంద్రయ్య, శాస్త్రవేత్తలు శ్రీచందన, నిరంజన్‌రెడ్డి, రైతులు సహకార సంఘాల సీఈవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సహకార సంఘం జిల్లా అధికారి రామాంజనేయులు

శ్రీశైలం నీటిమట్టం 884.40 అడుగులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే : శ్రీశైలం జలాశయం నీటిమట్టం బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి 884.40 అడుగులు, నీటినిల్వ 211.9572 టీఎంసీలుగా నమోదైంది. ఎగువనున్న జూరాల ప్రాజెక్టు నుంచి 73,573 క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 67,726 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

నకిలీ మరణ ధ్రువపత్రంపై లోకాయుక్తలో ఫిర్యాదు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: సర్వజన ఆసుపత్రి నుంచి బట్టు కృష్ణమూర్తి (65) అనే బతికున్న వ్యక్తికి మరణ ధ్రువపత్రం ఇవ్వడంపై లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయమై బుధవారం ఆసుపత్రి అధికారులు వివరణ అడిగారు. బట్టు కృష్ణమూర్తిది గూడూరు మండలం బూడిదపాడు గ్రామం. కానీ మరణ ధ్రువీకరణ పత్రంలో కోసిగి మండలం సంతనూతూరు చిరునామాతో ఆసుపత్రి నుంచి ఇచ్చినట్లు ఉంది. దీనిపై ఆసుపత్రి అధికారులు మేము ఇచ్చినది కాదు, ఎవరో ప్రైవేటు వ్యక్తులు ఇచ్చిన ధ్రువపత్రం అని చెబుతున్నారు. మెడికల్ రికార్డు సెక్షన్ అధికారులు మాట్లాడుతూ.. ఇది రెండు వారాల కిందట లోకాయుక్త నుంచి వచ్చింది, ఎవరో ప్రైవేటు వ్యక్తులు చేసిన నకిలీ ధ్రువపత్రం అని వివరణ ఇచ్చామన్నారు. రెండోసారి లోకాయుక్త నుంచి వివరణ అడగడంతో మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామని వివరణ ఇచ్చారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కల్లూరు మండలం పందిపాడుకు చెందిన షేక్ యూసూఫ్ (56) ఆత్మహత్య చేసుకున్నారు. ఆయన ఓ పాన్ షాపులో కూలీగా పని చేస్తున్నారు. భార్య షేక్ జులేఖా, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ అవసరాలకు రూ.4 లక్షలు అప్పులు చేసి తీర్చలేక ఒత్తిడికి గురయ్యేవాడు. కుమార్తె ప్రసవం కావడంతో ఆమెను చూసేందుకు భార్య, కుమారుడు వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న షేక్ యుసూఫ్ మంగళవారం ఫ్యానుకు ఉరేసుకున్నాడు. రాత్రి 11 గంటలకు తిరిగి వచ్చిన కుటుంబ సభ్యులు చూసి కిందకి దింపి వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు బుధవారం కర్నూలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌ఆర్సీ కార్యదర్శి బాధ్యతల స్వీకరణ

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి చిరంజీవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి కార్యదర్శిగా ఉన్న హనుమంతరెడ్డి నుంచి ఆయన బాధ్యతలు చేపట్టారు. విభాగ అధిపతులు సునీత, తారక నరసింహకుమార్, సురేష్ బాబు, శ్రీనివాసులురెడ్డి అభినందనలు తెలిపారు.

టెట్ పరీక్షకు 673 మంది గైర్హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: టెట్ పరీక్షకు 673 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈవో శామ్యూల్ బుధవారం తెలిపారు. ఉదయం సెషన్‌లో 2,083 మందికిగాను 1,763 మంది, మధ్యాహ్న సెషన్‌లో 2,286 మందికిగాను 1,933 మంది అభ్యర్థులు పరీక్ష రాసినట్లు చెప్పారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకటశేషాద్రి సూచించారు. నంద్యాల పట్టణంలోని ప్రత్యేక సబ్ జైలును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖైదీలతో సమావేశమయ్యారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆరోగ్య సమస్యలుంటే వైద్యులే సబ్ జైలుకు వచ్చి చికిత్సలు అందిస్తారని చెప్పారు. అనంతరం జైలు దస్త్రాలు పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో న్యాయవాది బాలూనాయక్, సబ్‌జైలు పర్యవేక్షకులు గురుప్రసాదరెడ్డి, లీగల్ సెల్ సిబ్బంది రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

పల్లెలను అభివృద్ధి చేసుకుందాం

హనువాళు(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదోని మండలం హనువాళు గ్రామంలో బుధవారం పల్లె పండుగ కార్యక్రమంలో రూ.10లక్షల సిమెంటు రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అంతకుముందు గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచి కిష్టమ్మ, ఎంపీటీసీ ఈరన్న, తెదేపా నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఉమ్మీసలీం, దేవేంద్రప్ప, జనసేన బాధ్యుడు మల్లప్ప, భాజపా రాష్ట్ర నాయకులు విట్టారమేష్, జిల్లా అధ్యక్షుడు నీలకంఠ, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, డ్వామా ఏపీడీ లోకేష్ పాల్గొన్నారు.

ఆలూరు గ్రామీణం: తుంబళబీడు, హుళేబీడు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి తెదేపా ఆలూరు నియోజకవర్గ నాయకుడు వీరభద్రగౌడ్ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ చౌడారెడ్డి, తెదేపా నాయకులు అశోక్‌యాదవ్, రాముయాదవ్, కేశన్న, లోకనాథ్, సర్పంచి పాల్గొన్నారు.

ఆ శాఖ తీరుపై ప్రజలు తిరగబడతారు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి వనరులు అధ్వానంగా ఉన్నాయని, తాగునీరు కలుషితం అవుతోందని, ఇలాగే కొనసాగితే గ్రామీణ నీటి సరఫరా శాఖపై ప్రజలు తిరగబడే పరిస్థితి వస్తుందని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఆదోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆదోని మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ దానమ్మ అధ్యక్షతన జరిగింది. తాగునీరు, ఆరోగ్యం, ఉపాధి పథకం, శిశుసంక్షేమ శాఖ, పశుసంవర్ధక తదితర శాఖలపై సమీక్షించారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా వ్యవస్థ లోపభూయిష్టంగా ఉందని, దీంతో జనం రోగాల బారిన పడుతున్నారన్నారు. ఇది ప్రజల జీవితాలతో చెలాగాటం ఆడటం కాదా? అని ప్రశ్నించారు. పలు సమస్యలను సభ్యులు ప్రస్తావించారు. సమావేశంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చినుకు.. దరిచేరని కునుకు

☛ తడుస్తున్న పంటలు, కూలుతున్న మిద్దెలు

☛ పొలాల్లోనే చేతికొచ్చిన దిగుబడులు

అల్పపీడన ప్రభావంతో చిరుజల్లులు కురుస్తున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో తుంగభద్ర, కృష్ణానదులు నిండుగా ప్రవహిస్తున్నాయి. నది పరీవాహక ప్రాంతాల్లోని పొలాలు జలమయం అవుతున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మట్టిమిద్దెలు తడిసి కూలుతున్నాయి. చేతికొచ్చిన పంటలు పొలాల్లోనే ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని పరిస్థితి ఇది.

మరింత తగ్గిన వేరుశనగ ధర

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన టెండర్లలో వేరుశనగ ధరలు మరింత తగ్గుముఖం పట్టాయి. తుపాన్ నేపథ్యంలో 3,120 సంచుల మేర వేరుశనగ దిగుబడులు అమ్మకానికి వచ్చాయి. క్వింటాలు కనిష్ఠంగా రూ.3,289, గరిష్ఠంగా రూ.6,569, మధ్య ధర రూ.5,899 పలికాయి. 15వ తేదీన గరిష్ఠ ధర రూ.6,776, 14న రూ.6,800, 9న 7,093, 8న రూ.7,289 పలికాయి. క్వింటాలుపై గరిష్ఠంగా రూ.700-800 తగ్గడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పైమార్కెట్లలో వేరుశనగ ధరలు తగ్గడం వల్లే ధరలపై ప్రభావం పడిందని వ్యాపార వర్గాలు తెలిపాయి. క్వింటాలు వేరుశనగ గింజలు రూ.10,400 ఉండే ధర రూ.9,500 పడిపోయిందన్నారు. దీనికి తోడు గుజరాత్ సరకు పైమార్కెట్లో అధికంగా వస్తోందన్నారు.

నిలిచిన శనగ సాగు

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో రబీలో శనగ సాగు పనులు నిలిచిపోయాయి. ఇప్పటికే 80 శాతం మంది రైతులు సాగు పూర్తి చేసుకున్నారు. మరో 20 శాతం మంది ఇంకా విత్తుకోవాల్సి ఉంది. తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల పొలాల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. విత్తుకున్న వారు సైతం అధిక వర్షాలు కురిస్తే భూమిలోనే విత్తనం కుళ్లిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కూలిన మిద్దె పైకప్పును చూపుతున్న గృహిణి

కూలిన మిద్దె.. తప్పిన ప్రమాదం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలో మంగళవారం రాత్రి నుంచి ఎడ తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో కుమ్మరి వీధిలోని షహినాబీకి చెందిన ఇంటి పైకప్పు కూలింది. కూలిన సమయంలో ఆ గదిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.

ప్రభావం ఇలా..

వ్యవసాయ సబ్ డివిజన్:	ఆదోని	ఆలూరు	పత్తికొండ
పరిధిలోని మండలాలు:	04	05	06
సాధారణ సాగు లక్ష్యం:	2,87,075	1.15 లక్షల హెక్టార్లు	2.46లక్షల హెక్టార్లు
సాగు విస్తీర్ణం:	1,90,945	52వేల హెక్టార్లు	2.96వేల హెక్టార్లు

ముంపు ప్రాంతాల పరిశీలన



పురపాలక అధికారులతో కలిసి పట్టణంలో పర్యటిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పురపాలక అధికారులతో కలిసి బుధవారం సాయంత్రం పర్యటించారు. హనుమాన్‌నగర్, వడ్డేగేరి, కంచిగారివీధి, యూన్నీలక్ష్మీబాయి కూరగాయల మార్కెట్, బంగారు బజారు, అంబేడ్కర్ కూడలి, మార్కెట్ యార్డు, మర్చంట్ క్లబ్ ప్రాంతాల్లో పర్యటించి ముంపు నివారణ చర్యలను పర్యవేక్షించారు. అక్కడి ప్రాంతాల పరిస్థితి, వరద నీరు నిలవకుండా చేపట్టాల్సిన పనులపై అధికారులకు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ముంపు ప్రాంత ప్రజల కోసం పురపాలక ఉన్నత పాఠశాలలో తాత్కాలిక శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. సబ్ కలెక్టర్, తహసీల్దారు, పురపాలక కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు సైతం అందుబాటులో ఉంటాయన్నారు. ఆయన వెంట పురపాలక కమిషనర్ కృష్ణ, ఎంఈ ఇంతియాజ్ ఆలీ, డీఈలు, ఏఈలు తదితరులున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


హాలహర్వి, న్యూస్‌టుడే: తుపాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పత్తికొండ ఆర్డీవో భారత్ నాయక్ అన్నారు. బాపురం దిగువ కాల్వను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వాగులు, వంకలు ఉద్ధృతంగా ప్రవహించే గ్రామాల్లో సిబ్బందితో ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేయాలని తహసీల్దారు నజ్మీబానును ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం లోపించకుండా గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈవోఆర్డీ రామాంజనేయులను ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ లక్ష్మి, ఆర్ఐ మహేష్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బాపురం వద్ద దిగువ కాల్వ వివరాలు తెలుసుకొంటున్న ఆర్డీవో భరత్ నాయక్

పత్తికొండ మండల పరిధిలోని హోసూరులో రైతు దరిమిగారి రవికి చెందిన ఉల్లి దిగుబడి కొంత మేర తడిసిపోయింది. గ్రామ సమీపంలో టార్పాలిన్ పట్టలతో వేసిన టెంట్‌లోకి వర్షం నీరు చేరటంతో గ్రేడింగ్ కోసం ఉంచిన ఉల్లి తడిసిపోయినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





తడుస్తున్న తెల్ల బంగారం

దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండ మండలంలో అత్యధికంగా ఖరీఫ్‌లో 37,500 ఎకరాల్లో పత్తి పంట సాగుచేశారు. ప్రస్తుతం పంటల కోతకు కూలీల కొరతతో సన్నకారు రైతులు దిగుబడిని పొలంలో వదిలేశారు. అంతలోనే చినుకులు పలకరించడంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఇలా పొలాల్లోని దిగుబడి తడిసి ముద్దవుతోందని రైతులు వాపోతున్నారు.

ఉల్లి రైతుల కష్టాలు

మద్దికెర, న్యూస్‌టుడే: కోత తర్వాత తుపాను మొదలు కావడంతో అవస్థలు తప్పడం లేదని ఉల్లి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన ఉల్లి పంటను ఇటీవలే రైతులు కోత కోశారు. వాతావరణంలో మార్పుతో పాటు, తేలికపాటి వర్షాలు కురుస్తుండటంతో పొలాల్లో ఆరబెట్టిన ఉల్లి దిగుబడులు తేమకు తడిసి దెబ్బతింటున్నాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మద్దికెరలో తడిసిన ఉల్లిని గ్రేడింగ్ చేస్తున్న రైతులు

24 గంటలూ అందుబాటులో ఉండేలా..

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పురపాలక కార్యాలయంలో 24*7 పనిచేసేలా సహాయ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు పురపాలక కమిషనర్ కృష్ణ బుధవారం తెలిపారు. భారీ వర్షాలు కురిసే పరిస్థితులు ఉండటంతో లోతట్టు ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందు లుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్ల వివరాలు తమకు తెలపాలన్నారు. ఇందు కోసం కంట్రోల్ రూం 08512-295468 కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

వసతులు లేక సతమతమవుతున్నారా!

మీ కాలనీలో తాగునీరు సరిగా సరఫరా కావడం లేదా? వీధి దీపాలు వెలగడం లేదా? మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదా? వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోతోందా. తాగునీటి పైపులైన్ లీకవుతోందా? కుక్కలు, పందుల బెడద అధికంగా ఉందా? శివారు కాలనీల సమస్యలు పట్టించుకోవడం లేదా? ఇలాంటి సమస్యలతో సతమతమవుతున్నారా? వీటి పరిష్కారానికి 'ఈనాడు-మేమున్నాం.. మీకు తోడుగా' వేదికగా పురపాలక కమిషనర్‌తో ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మీరు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలు తెలపండి. అవి పరిష్కారమయ్యేలా చూస్తాం. ఇంకెందుకు ఆలస్యం. వెంటనే ఫోన్ చేసి సమస్య వివరించండి.

తేది: 17 (గురువారం)

సమయం: ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు

✆ 98499 05859

పల్లె కబుర్లు

తెర్నేకల్(దేవనకొండ), న్యూస్‌టుడే: తెర్నేకల్, పాలకుర్తి గ్రామాల్లో బుధవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రహదారి, మినీ గోకులం నిర్మాణం, తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిన్న వెంకప్ప, వీరాంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

పోతుగల్లు, పందిర్లపల్లె (కృష్ణగిరి), న్యూస్‌టుడే: పోతుగల్లు, లాల్‌మానుపల్లె, పందిర్లపల్లె, బి.బొంతిరాళ్ల గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ నిర్వహించారు. ఆయా గ్రామాల తెదేపా నాయకులు సోమలింగడు, మదార్, మోహన్, సర్పంచి రవిమోహన్, మాబాషాతో కలిసి అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌కుమార్, పీఆర్ ఏఈ జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

యడవలి(మద్దికెర), న్యూస్‌టుడే: యడవలి గ్రామంలో సిమెంటు రహదారుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. సర్పంచి కల్పన, తెదేపా నాయకులు జయరాం పాల్గొన్నారు.

ఎద్దులదొడ్డి(తుగ్గలి), న్యూస్‌టుడే: ఎద్దులదొడ్డి, శభాష్‌పురం గ్రామంలో మురుగు కాలువల నిర్మాణ పనులకు ఎంపీడీవో విశ్వమోహన్, ఎద్దులదొడ్డి గ్రామ సర్పంచి విజయ్ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏపీడీ పక్కీరప్ప, ఏపీవో హేమసుందర్, స్థానిక నాయకులు శ్రీనివాసగౌడ్, మోహన్, శ్రీరాములు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆదోనికి చెందిన తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, నాయకులు వినయ్ బుధవారం ఉండవల్లిలో ఆయనను కలిశారు. ఆదోని నియోజకవర్గ పరిస్థితులు వివరించారు. తెదేపాలో కష్టపడిన వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారన్నారు.

రైలు నుంచి కిందపడి వ్యక్తి దుర్మరణం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలోని ఇస్వీ-కుప్పగల్లు రైల్వే లైను మధ్యలో ఆర్.నవీన్‌కుమార్(34) రైలు నుంచి కిందపడి మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన నవీన్‌కుమార్ బెంగళూరుకు వలస వెళ్లి బేల్దారుగా జీవనం సాగిస్తున్నారు. రాయచూరులో ఉంటున్న భార్య, పిల్లలను చూసేందుకు బెంగళూరు నుంచి హాసన్ ఎక్స్‌ప్రెస్ రైలులో రాయచూరుకు వెల్తుండగా.. ప్రమాదవశాత్తు రైలు నుంచి కాలుజారి కిందపడిపోయి తీవ్రంగా గాయపడి మృతిచెందాడన్నారు. మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కర్ణాటక పోలీసుల విచారణ

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని షరాఫ్ బజారులోని ఓ బంగారు వ్యాపారి దొంగ బంగారం కొనుగోలు చేశాడన్న ఆరోపణపై కర్ణాటక పోలీసులు విచారణ చేపట్టారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నగరంలో సుమారు 15 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు కేసును ఛేదించి అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన వ్యక్తిని అరెస్టు చేశారు. బంగారు నగలను ఆదోని పట్టణంలోని ఓ బంగారు వ్యాపారికి విక్రయించినట్లు విచారణలో తేలింది. దీంతో ఆదోని పట్టణానికి వచ్చి సదరు బంగారు వ్యాపారిని అదుపులో తీసుకొని విచారణ చేపట్టినట్లు తెలిసింది. పలువురు మంతనాలు జరిపి, నగలు తిరిగి ఇచ్చేలా రాజీ కుదిర్చినట్లు తెలిసింది.

మద్యం ప్యాకెట్లు పట్టివేత

ఆదోని గ్రామీణం న్యూస్‌టుడే: నారాయణపురం గ్రామానికి చెందిన శివలింగను అరెస్టు చేసి, అతని నుంచి 144 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇస్వీ ఎస్సై నాగేంద్ర బుధవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇసుక వాహనాల తనిఖీ

హొళగుంద, హాలహర్వి, న్యూస్‌టుడే: హొళగుంద మండలం మార్లమడికి గ్రామంలోని వేదవతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బాల నరసింహులు తెలిపారు. మండల కేంద్రంలో వాహనాలు తనిఖీ చేస్తుండుగా ఆలూరు మండలం అరికెర గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డికి చెందిన టిప్పర్‌లో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారన్నారు. కేసు నమోదు చేసి జిల్లా మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

విత్తనాల విషయంలో ఘర్షణ

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎరువుల వ్యాపారి, కపటి గ్రామానికి చెందిన భాజపా నాయకుడు కపటి రాజు మధ్య ఘర్షణ జరిగిన వీడియోలు ఆలస్యంగా వెలుగు చూశాయి. పట్టణంలోని ఓ ఎరువుల దుకాణంలో ఈ నెల 14వ తేదీన భాజపా నాయకుడి కుమారుడు మినుము విత్తనాలు కొనుగోలు చేశారు. ఈ నెల 15వ తేదీన మార్చాలని కోరారు. ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకొని ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో ఎరువుల వ్యాపారి, భాజపా నాయకుడు పరస్పరం ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతున్నాయి.

యడవలిలో దస్తగిరయ్యస్వామికి పూజలు



యడవలిలో దస్తగిరయ్యస్వామి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

యడవలి(మద్దికెర), న్యూస్‌టుడే: యడవలి గ్రామంలో దస్తగిరయ్యస్వామికి భక్తులు బుధవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామి వారి ప్రతిమను గుర్రంపై గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జెండాకట్టపై కొత్త జెండాను ఆవిష్కరించారు.

జొన్న పంటపై గడ్డి మందు పిచికారీ



ఈరమ్మ, బాధితురాలు

ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పది ఎకరాల్లో ఏపుగా పెరుగుతున్న జొన్న పంటపై గడ్డి మందు పిచికారీ చేశారని బాధితురాలు ఎల్లమ్మ ఆరోపించారు. మణేకుర్తి గ్రామంలో సర్వే నంబరు 174/డీలో తనకున్న 9.82 ఎకరాల్లో రూ.1.50 లక్షల పెట్టుబడితో జొన్న సాగుచేశారు. పంటబాగానే పెరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆ పంటకు గడ్డి మందు పిచికారీ చేయడంతో ఎర్రబారిపోతోందని ఆమె వాపోయారు. తన కుమారులకు, తనకు ఆస్తి వివాదం ఉందని, వారే ఇలా చేసి ఉంటారని ఆరోపించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపడతామని ఎస్సై వెంకటనరసింహులు తెలిపారు.



స్వామి వారి అశ్వాన్ని ఊరేగిస్తున్న నిర్వాహకులు, గ్రామస్థులు

కుంకనూరులో ముగిసిన ఉరుసు

దేవనకొండ, న్యూస్‌టుడే: కుంకనూరు గ్రామంలో వెలసిన హజరత్ దస్తగిరయ్య స్వామి ఉరుసు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారి అశ్వాన్ని వెండి ఆభరణాలతో అలంకరించి పుర వీధుల్లో ఊరేగించారు.

మార్కెట్ యార్డుకు సెలవు నేడు

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం వాల్మీకి జయంతి పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్లు యార్డు కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. యార్డు హమాలీ సంఘాల విజ్ఞాపన మేరకు సెలవు ప్రకటించారన్నారు. దీంతో పంట దిగుబడుల క్రయ, విక్రయాలు ఉండవని రైతులు గమనించాలన్నారు.

వాల్మీకి జయంతి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పురపాలక సంఘం కౌన్సిల్ హాల్‌లో గురువారం వాల్మీకి జయంతి నిర్వహించనున్నట్లు పురపాలక కమిషనర్ కృష్ణ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే పార్థసారథితో పురపాలక ఛైర్‌పర్సన్ శాంత, వార్డు కౌన్సిలర్లు హాజరవుతారన్నారు.

బన్నీ ఉత్సవాలు విజయవంతం

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా హొళగుంద మండలం దేవరగట్టులో బన్నీ ఉత్సవాలు విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన పోలీసు అధికారులను కృతజ్ఞతలు తెలిపినట్లు పత్తికొండ మాళమల్లేశ్వరస్వామి ఆలయ ట్రస్టు సభ్యులు తెలిపారు. పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్‌ను ఆలయ ట్రస్టు, గొరవయ్యల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐని కలిసిన వారిలో ఆలయ ట్రస్టు సభ్యులు లాలప్ప, శ్రీరాములు, మల్లికార్జున, రంగన్న, లోకేశ్ తదితరులు ఉన్నారు.



పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ



మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర మేజరు పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న 65 మంది కార్మికులకు బుధవారం స్థానిక కార్యాలయంలో సర్పంచి సుహాసిని, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, పాలకవర్గ సభ్యులు దుస్తులు, పాదరక్షలు అందజేశారు.

వాల్మీకి అడుగుజాడల్లో నడవాలి



వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి, తదితరులు

చిప్పగిరి, న్యూస్‌టుడే: యువత వాల్మీకి అడుగుజాడల్లో నడవాలని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. డేగులహాలులో సర్పంచి నీలకంఠ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జూటూరు మారయ్య, మురళీధర్‌రెడ్డి, సేనాపతి, ఓబులేష్, మల్లికార్జున, లాలుస్వామి, లింగన్న పాల్గొన్నారు.

మా కాలనీలో మద్యం దుకాణం వద్దు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని 18వ వార్డులోని శ్రీశంబులింగేశ్వరస్వామి దేవాలయం సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని కాలనీవాసులు ఆందోళనకు దిగారు. ఆదోని సబ్ కలెక్టర్ భరద్వాజ్, ఆదోని ఎమ్మెల్యే డాక్టరు పార్థసారథిని బుధవారం కలిసి కాలనీ వాసులు వినతి పత్రం అందించారు. కాలనీ వాసులు మాట్లాడుతూ.. ఆలయానికి భక్తుల రాకపోకలకు ఇబ్బందులు పడతారన్నారు.

పేరులో ఆదర్శం.. తీరులో అధ్వానం

☛ వేధిస్తున్న అసౌకర్యాలు, సిబ్బంది కొరత

☛ పత్తికొండ పాఠశాల విద్యార్థుల అవస్థలు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు మొత్తం 540 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రిన్సిపల్‌తో కలిపి మొత్తం 20 మంది బోధనా సిబ్బంది ఉండాలి. రెండేళ్లుగా టీజీటీ గణితం, టీజీటీ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. బోధించేందుకు ఎవరూ లేరు. పీజీటీ జీవశాస్త్రం బోధించే అధ్యాపకురాలు 2022 నవంబర్ నుంచి సెలవులో ఉన్నారు. ఆయా పాఠ్యాంశాలు బోధించేందుకు అతిథోపన్యాసకులు సైతం రాకపోవటంతో విద్యార్థులు వెనుకబడిపోతున్నారు. పాఠశాలలో బోధనేతర విధులు నిర్వహించే జూనియర్ సహాయకుడు, కంప్యూటర్ ఆపరేటర్, కంప్యూటర్ శిక్షకుడు, లైబ్రేరియన్ సిబ్బంది కూడా లేరు. దీంతో ఉపాధ్యాయులు, అధ్యాపకులే బోధనేతర పనులు సైతం చేపట్టాల్సి రావటంతో పనిభారం తప్పడం లేదు. చదువులు అగమ్యగోచరంగా మారటంతో కొంత మంది విద్యార్థులు టీసీలు తీసుకొని వెళ్లినట్లు సమాచారం. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని విద్యార్థులు పలుసార్లు రోడ్డెక్కారు. ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.



పత్తికొండ ఆదర్శ పాఠశాల వసతి గృహంలో తాగునీటికి విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుద్ధజల యంత్రం మరమ్మతులతో మూలకు చేరింది. రెండేళ్లుగా నిరుపయోగంగా మారింది. విద్యార్థినులు కంచాలు కడిగే నీటితోనే దాహం తీర్చుకుంటున్నారు. కుళాయిల పైపులైన్లు లీవుతున్నాయి.

ఉన్నతాధికారులకు వివరించాం

– విక్టర్ సామ్యూల్, ప్రిన్సిపల్, ఆదర్శ పాఠశాల



ఖాళీగా ఉన్న ఆయా పాఠ్యాంశాల ఉపాధ్యాయ ఖాళీల భర్తీతో పాటు, ఇతర సిబ్బంది, తాగునీటి సమస్య, శుద్ధజల యంత్రం మరమ్మతులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. బాలికల వసతిగృహంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రస్తుతం బయట నుంచి శుద్ధ జల క్యాన్లు తెస్తున్నాం. నిధులు కేటాయించిన వెంటనే మరమ్మతులు చేపడతాం.

గుంతల మయంగా పాఠశాల దారి

పత్తికొండ పట్టణం నుంచి సుమారు రెండున్నర కి.మీ. దూరంలోని పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు ప్రయాస పడుతున్నారు. పుచ్చకాయలమడ ప్రధాన రహదారి నుంచి పాఠశాలకు వెళ్లే మార్గంలో సుమారు అర కి.మీ. మట్టిదారిలో గుంతలు ఏర్పడటంతో ఆటోలు, దిచక్రవాహనాలు, సైకిళ్లపై వచ్చే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వర్షం వచ్చినపుడు పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోందని వారు వాపోతున్నారు.



నిరుపయోగంగా ఉన్న శుద్ధజల కేంద్రం

ప్రజల బాగోగులు కోరం



ప్రజా సమస్యలపై చర్చించేందుకు మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం బుధవారం వాయిదా పడింది. మండలంలో మొత్తం 16 మంది ఎంపీటీసీ సభ్యులున్నారు. ఎంపీపీ రంగమ్మతో పాటు మరో ఎంపీటీసీ సభ్యురాలు మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో రమాదేవి ప్రకటించారు. దీంతో సమావేశానికి వెళ్లిన అధికారులు, సర్పంచులు వెనుదిరిగారు. ప్రజా సమస్యలు చర్చించేందుకు కూడా ప్రజాప్రతినిధులకు తీరిక లేదా అని పలువురు విమర్శలు గుప్పించారు. – న్యూస్‌టుడే, ఆలూరు గ్రామీణ

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

సంపూర్ణ సేవకు రూ.లక్ష విరాళం

మంత్రాలయం, న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన ద్వారకానాథ్ రాఘవేంద్రస్వామి ఒక రోజు సంపూర్ణ సేవకు రూ.లక్ష విరాళంగా అందజేసినట్లు మఠం మేనేజర్ వెంకటేశ్ జోషి తెలిపారు. బుధవారం మంత్రాలయం చేరుకొని గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులకు విరాళం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పమాలధారణ

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోడుమూరులో నిర్మాణ దశలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం స్వామికి వేదమంత్రోచ్ఛరణల మధ్య పూజలు నిర్వహించారు. గురుస్వామి చిట్టిబాబు ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన 40 మంది మాలాధారణ స్వీకరించారు.

సుంకేసులకు తగ్గిన ఇన్‌ఫ్లో

గూడూరు న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. బుధవారం నాటికి 35,780 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు జలాశయ ఇంజినీరు రాజు తెలిపారు. 8 గేట్లు ఎత్తి నది దిగువకు 35,274 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు (గ్రామీణం) : 80085 73734
కోడుమూరు : 80085 73776

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: **సమస్య:** మండలంలోని గంగులపాడులో చాలా రోజుల నుంచి మురుగు కాల్వలు శుభ్రం చేయడం లేదు. దీంతో కాల్వలు నిండి అపరిశుభ్రతతో దుర్వాసన వెదజల్లుతోంది. –గ్రామస్థులు, గంగులపాడు

సమాధానం: గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత సమస్యను గ్రామ కార్యదర్శి సర్పంచి దృష్టికి తీసుకెళ్తాం. పంచాయతీలో నిధులను అనుసరించి చర్యలు చేపడతాం. – జయరాముడు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో, పెద్దకడబూరు

సి.బెళగల్, న్యూస్‌టుడే: **సమస్య:** సి.బెళగల్ చెరువుకు గాజులదిన్నె జలాశయం నుంచి టీబీపీ దిగువ కాలువ ద్వారా సాగునీరు మళ్లించాలి. – నరసింహాగౌడు సి.బెళగల్

సమాధానం: గాజులదిన్నె జలాశయం నుంచి టీబీపీ దిగువ కాలువ ద్వారా సి.బెళగల్ చెరువుకు సాగునీరు మళ్లించేందుకు చర్యలు తీసుకుంటాం. – ఈవోఆర్డీ ఈశ్వరయ్య స్వామి, సి.బెళగల్

సమస్య: సి.బెళగల్‌లోని ఉన్నత పాఠశాల వద్ద అసంపూర్తిగా నిలిచిన ప్రహరీ నిర్మాణం చేపట్టాలి. – మల్లేశ్వరమ్మ, సి.బెళగల్

సమాధానం: సత్వరమే సర్వశిక్ష అభియాన్ ఏఈ దృష్టికి తీసుకెళ్లి అసంపూర్తి ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. – రాణెమ్మ, ఎంపీడీవో, సి.బెళగల్

సమస్య: ఐనగంద నుంచి కొండాపురం మట్టి రహదారిని బీటీగా మార్చాలి. –శంకర్‌రెడ్డి, కొండాపురం

సమాధానం: కోడుమూరు పంచాయతీరాజ్ శాఖ డీఈకు కర్నెన్న దృష్టికి తీసుకెళ్లి ప్రతిపాదనలు పంపి బీటీ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. –రాణెమ్మ, ఎంపీడీవో, సి.బెళగల్

సమస్య: సి.బెళగల్, బురాన్‌దొడ్డి, కోడుమూరు బస్సు సర్వీసును పునరుద్ధరించండి. – దౌలప్ప, బురాన్‌దొడ్డి

సమాధానం: ఎమ్మిగనూరు డిపో మేనేజరు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం. –ఈశ్వరయ్య స్వామి, ఈవోఆర్డీ

సమస్య: మారందొడ్డిలో కమ్యూనిటీ భవనం నిర్మించండి. – సోమప్ప, మారందొడ్డి

సమాధానం: కమ్యూనిటీ భవనం నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. – రాణెమ్మ, ఎంపీడీవో, సి.బెళగల్

సమస్యలు పరిష్కరించాలి

గూడూరు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే దస్తగిరి అధికారులకు సూచించారు. గూడూరు వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గొని ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. గూడూరుకు చెందిన వృద్ధులు పింఛను రావడం లేదని మంజూరు చేయాలని కోరగా ఎంపీడీవో శివనాగప్రసాద్‌కు పరిష్కరించాలని సూచించారు. రీ సర్వేలో తప్పులు జరిగాయని సరి చేయాలని రైతులు కోరగా తహసీల్దార్ రామాంజనేయులకు పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు సమస్యను విన్నవించుకుంటున్న వృద్ధులు

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

గూడూరు న్యూస్‌టుడే: వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని కర్నూలు పార్లమెంటు తెదేపా యువత కార్యదర్శి చరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు. గూడూరు వాల్మీకి నాయకులు బుధవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణ వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు సంగాల మద్దు, రైతు సంఘం కార్యదర్శి రేపల్లె గోవిందు, కర్ల తదితరులు పాల్గొన్నారు.



కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వాల్మీకులు

అధికారుల నిర్లక్ష్యం..
సామాన్యుడికి భారం



ఎమ్మిగనూరు పురపాలక సంఘంలో నిర్మించిన ఇళ్లు

మార్కెట్ విలువలో 0.15శాతం పన్ను

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో ఇంటి పన్నులు ఇష్టారాజ్యంగా చేపట్టారు. కొందరికి ఎక్కువగా పన్నులు వేయగా.. మరికొందరికి అసలు పన్నులు వేయకుండా వదిలేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులు చెప్పిన విధంగా నడుచుకున్న అధికారులు ఇంటి పన్నుల విషయంలో పెత్తందారి వ్యవస్థను అనుసరించారు. సామాన్యులకు రెండింతలు పెంచి వారి నడ్డి విరిచారు. తాగునీరు, విద్యుత్తు, రహదారులు, మురుగు కాల్వలు లేక కొన్ని కాలనీల్లో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

ఇంటి పొడవు, వెడల్పు ప్రకారం మార్కెట్ విలువలో 0.15 శాతం పన్ను వేస్తారు. వైకాపా హయాంలో ఇంటి పన్నులు కొందరికి అధికం.. మరికొందరికి అసలు వేయకుండా వదిలేశారు. ఇంటిని నిర్మించుకొని నాలుగున్నర ఏళ్లు గడిచిన వాటిని అసలు పట్టించుకోలేదు. వీటి వెనుక వైకాపా నేతల హస్తం ఉండటంతో అధికారులు చూసీ చూడనట్లు వదిలేశారు. కొందరికి రెండింతలు పన్ను వేసి దండుకున్నారు.

ఎమ్మిగనూరు పట్టణంలో 2018-2019 ఏడాదిలో 20,500 అసెస్‌మెంట్లులో ఇంటి పన్ను కింద రూ. 2.90 కోట్లు మేరకు డిమాండు ఉంది. శివారు ప్రాంతాల్లో అభివృద్ధి పనుల కోసం అప్పట్లో సిప్ కింద రూ. 30 కోట్లు పనులకు ఆమోదించడం జరిగింది. వీటి ప్రతిపాదనలు అన్నీ గతంలో సిద్ధం చేశారు. కానీ 2019లో వైకాపా ప్రభుత్వం ఏర్పడిన తరువాత పట్టణ అభివృద్ధి కుంటుపడింది. 2024-25లో అసెస్‌మెంట్లు 25 వేలకు పెరిగాయి. ఐదేళ్ల వైకాపా హయాంలో దాదాపు 1,600 కొత్త ఇళ్లు దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో దాదాపు 1,450కిపైగా ఇళ్లకు అనుమతులు ఇచ్చారు. వీటిలో కొత్త ఇళ్లు పూర్తి చేసిన వాటికి పన్నులు చెల్లించకుండా దాదాపు 300 నుంచి 500 ఇళ్లకు పూర్తిగా పన్నులు వేయకుండా నాలుగున్నర ఏళ్లగా వదిలేశారు. రూ.కోట్లు వసూలు చేయాల్సిన అధికారులు అప్పటి ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో వాటిని వదిలేశారు.

వదిలేసిన కాలనీలు: మునెప్పనగర్, రాఘవేంద్ర, ఎస్ఎంటీ, వెంకటాపురం, లక్ష్మణ్ టాకీస్, గూడూరు రోడ్డు, అబ్బాస్ టాకీస్, లక్ష్మీపేట, హనుమాన్, సోమప్ప నగర్ తదితర ప్రాంతాల్లో అత్యధికంగా పన్నులు వేయకుండా వదిలేశారు.

జనాభా:	1.26 లక్షలు
గృహాలు:	25,173
ఇంటి పన్నులు:	రూ.5.37 కోట్లు
మురికివాడలు:	66
వార్డులు:	34
రెవెన్యూ వార్డులు:	18



సోమప్ప నగర్ కాలనీ మురుగు కాల్వల దుస్థితి

సర్వే చేసి చర్యలు తీసుకున్నాం

- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు

ఇంటి పన్నులపై సచివాలయ సిబ్బందితో సర్వే చేయిస్తున్నాం. గతంలో కొన్ని ఇళ్లకు పన్నులు వేయకుండా వదిలేశారు. అయితే వాటిని గుర్తించి అసెస్‌మెంట్లను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే దాదాపు 300 గుర్తించాం. వీటికి పన్నులు వేసేందుకు చర్యలు తీసుకున్నాం. పన్ను వసూళ్లలో రాజకీయంగా ఎలాంటి ఒత్తిళ్లు లేవు. నిబంధనల మేరకు మార్కెట్ విలువ ప్రకారం పన్నులు వసూళ్లు చేస్తాం.

తగ్గిన వేరుసెనగ ధర

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్లో అక్టోబరు మొదటి వారంలో వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.7వేలకు పైగా అమ్ముడు పోగా క్వింటా గరిష్ఠ ధర రూ.6 వేలు లోపు పలికింది. పది రోజుల వ్యవధిలో క్వింటాకు రూ. 1000 తగ్గడంతో రైతులు లబోదిబోమంటున్నారు. బుధవారం క్వింటా గరిష్ఠ ధర రూ.5,970, మధ్యస్థం రూ.4,700, కనిష్ఠం రూ.2,009కు వ్యాపారులు కొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: అనారోగ్యంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు బుధవారం మృతి చెందారు. వృద్ధుడికి ఎవరూ లేక పోవడంతో బీసీ సంఘం నాయకులు అంత్యక్రియలు నిర్వహించారు. పులె అంబేడ్కర్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు నరసన్న, ప్రసాద్, వ్యవసాయ మార్కెట్ సూపర్‌వైజర్ రాము, బీసీ సంఘం నాయకులు గణేశ్, బతకన్న శవాన్ని ప్రత్యేక వాహనంలో తరలించి బీసీ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

విరిగిన స్తంభం

కోడుమూరులో కొండపేట వీధి చేనేత కాలనీలో విద్యుత్తు స్తంభం దెబ్బతిన్నది. దాదాపు మూడు నెలల నుంచి విద్యుత్తు స్తంభం విరిగి ఎప్పుడు పడుతుందో అని కాలనీవాసులు భయపడుతున్నారు. సమస్యను లైన్‌మెన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని.. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. చేనేత కాలనీలో దాదాపు 70 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

– న్యూస్‌టుడే, కోడుమూరు పట్టణం



పారని మురుగు.. తీరని సమస్య

మాచాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో కాల్వల్లో మురుగు నిలిచి దుర్వాసన వ్యాపిస్తోంది. కాల్వల్లో పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం చేరింది. పంచాయతీ సిబ్బంది కాల్వల్లో చెత్త తొలగింపును పట్టించుకోకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాల్వల్లో చెత్త తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నందవరం



దారెంట కంప చెట్లు.. తొలగించాలి కనిపించేట్లు



మండలంలోని జూలకల్లు నుంచి బ్రాహ్మణదొడ్డి గ్రామానికి వెళ్లే బీటీ రహదారి పక్కన కంప చెట్లు దట్టంగా పెరిగాయి. మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. 3 కి.మీ. దూరంలో ఏడు మలుపులున్నాయి. ఏ మలుపు వద్ద ఏ వాహనం వస్తుందో తెలియక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి కంప చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, సి.బెళగల్ గ్రామీణం

కొత్త వంగడాలు వినియోగించాలి

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు కొత్త వంగడాలను వినియోగించాలని ఆత్మా పీడీ రత్నకుమార్ సూచించారు. ప్యాలకుర్తిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. కొత్త వంగడాలతో అధిక దిగబడులు వస్తాయన్నారు. గ్రామం కూరగాయల, పండ్ల తోటల పెంపకంలో ముందుందని కొనియాడారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కిశోర్ మాట్లాడుతూ.. రైతులు 155251 టోల్‌ఫ్రీ నంబర్‌ను వినియోగించుకుని సాగులో మెలకువలు తెలుసుకోవచ్చునన్నారు.

పంటలు కాపాడుకోవాలి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు సాగు చేసిన పంటలు దెబ్బతినకుండా కాపాడుకోవాలని ఎమ్మిగనూరు ఏడీఏ మహ్మద్ ఖాద్రి సూచించారు. బుధవారం వేముగోడులో పొలం పిలుస్తోంది కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడారు. మొక్కజొన్న పంటలో తీసుకోవల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పంట దశను బట్టి నష్ట తీవ్రత ఉంటుందన్నారు. వ్యవసాయాధికారిణి హేమలత, వ్యవసాయ సిబ్బంది జాకీర్, రైతులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని పీకలబెట్ట గ్రామంలో బుధవారం మండల వ్యవసాయాధికారి వరప్రసాద్ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పత్తి, మిరప, వరి, మొక్కజొన్న పంటల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

మంత్రాలయం, న్యూస్‌టుడే: పంటలకు సూక్ష్మ పోషకాలు ఆవశ్యకత గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు రైతులకు వివరించారు. బుధవారం మండల పరిధిలోని కల్లుదేవకుంట, మాలపల్లి, సుంకేశ్వరి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తుపాను ప్రభావం వల్ల పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులు రైతులకు వివరించారు. కేవీకే శాస్త్రవేత్త అపర్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్లు, డీఆర్‌సీ ఏవో శశిధర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి జీరా గణేశ్ పాల్గొన్నారు.

కోసిగి, న్యూస్‌టుడే: మిరప పంటలో వచ్చే తెల్ల దోమలు, తామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కేవీకే బనవాసి శాస్త్రవేత్త మౌనిక, జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు రైతులకు వివరించారు. బుధవారం కోసిగి మండలం సాతనూరు, అగసనూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

ఇంటింటికీ ఉచిత కుళాయిలు



గుడేకల్లులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రతి ఇంటికి ఉచిత కుళాయి ఏర్పాటు చేస్తామని ఎవరైన డబ్బులు అడిగితే పైసా ఇవ్వొద్దని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పల్లెపండుగ కార్యక్రమం మండలంలోని గుడేకల్లు గ్రామంలో సభ నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెదేపా ప్రభుత్వం అధికారంలో రావడంతో గ్రామానికి తాగునీటి కోసం రూ.66 లక్షల నిధులు విడుదల చేసి ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామంలో రూ.20 లక్షలతో ప్రత్యేకంగా డ్రైనేజీ పనులు చేపడుతున్నామని వివరించారు. కొత్త పింఛన్లు జనవరి నుంచి వస్తాయని అర్హులైన ప్రతి ఒక్కరికి పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌డీఈ చంద్రశేఖర్, విద్యుత్తు ఏడీఈ నాగేంద్రప్రసాద్, పీఆర్ ఏఈ జయన్న, తెదేపా నాయకులు దేవదాస్, దస్తగిరి, అయ్యన్న, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



కోసిగి: దొడ్డి బెళగల్‌లో పల్లె పండగ కార్యక్రమంలో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి, తదితరులు



మంత్రాలయం: సూగూరులో సీసీ రోడ్డు పనులకు అధికారులతో కలసి భూమి పూజ చేస్తున్న తెదేపా నాయకుడు రఘునాథ్‌రెడ్డి



కౌతాళం: గుడికంబాలిలో భూమిపూజలో పాల్గొన్న తెదేపా మండలాధ్యక్షుడు ఉలిగయ్య, అడివప్పగౌడు తదితరులు



పెద్దకడబూరు: సీసీ రహదారికి భూమి పూజ చేస్తున్న రమాకాంతరెడ్డి



శిల్పా కాలనీలోని పార్కులో మొక్కలు నాటుతున్న పురపాలక కమిషనర్

పచ్చదనంతోనే కాలుష్య నివారణ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కాలుష్యాన్ని నివారించాలంటే పచ్చదనంతో సాధ్యమని ప్రతి ఒక్కరూ మొక్కలు నాట్టాలని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో శిల్పా కాలనీలోని పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో పురపాలక ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంచుతామన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద మొక్కలు పెంచేందుకు ఆసక్తి చూపితే వారికి ఉచితంగా ఇస్తామన్నారు. పురపాలక సంఘం సిబ్బంది మద్దిలేటి, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే సహించలేదని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం గుడేకల్లు రహదారిలో ఉన్న శుద్ధజల కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఫిల్టరు బెడ్లు పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. ఫిల్టర్ బెడ్డులో ఎప్పటికప్పుడు ఇసుకను మార్చాలని సూచించారు. క్లోరినేషన్ సక్రమంగా ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. డీఈ నీరజా, ఏఈ శరత్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఆహారపు పదార్థాలలో రసాయనాలు అధికంగా వినియోగిస్తున్నారని.. ఆహారపు అలవాట్ల మార్పుతో ఆరోగ్యం మెరుగు పడుతుందని మహాయోగి లక్ష్మమ్మ అవ్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహబూబ్‌బాషా పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు పండిస్తున్న పంటలను మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడుతున్నారన్నారు. కావునా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం సుశీలమ్మ, ఖాదర్‌బాషా, షాజహాన్‌బేగం, మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నదీతీర ప్రాంతాల పరిశీలన

కొత్తకోట, ఈర్లదిన్నె (సి.బెళగల్), న్యూస్‌టుడే: తుంగభద్ర నది పొంగి ప్రవహిస్తుండటంతో బుధవారం సి.బెళగల్ తహసీల్దారు శ్రీనివాసు సిబ్బందితో వెళ్లి పరీవాహక ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. నదీలోకి చేపలు ఎవరూ వెళ్లకూడదని హెచ్చరికలు చేశారు. ఉప తహసీల్దారు పురుషోత్తం వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

నిర్వహణ లేక..
తాగునీరు అందక

❒ టెండర్ల ప్రక్రియ పూర్తి

గ్రామీణ ప్రజలకు శుద్ధ నీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు చేసి ఎస్‌ఏపీ, ఎస్ఎస్ ట్యాంక్‌లు నిర్మించారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో పథకాల నిర్వహణను గాలికొదిలేయడంతో ఆయా గ్రామాల్లో కనీసం తాగునీరు కూడా అందించలేకపోయారు. జిల్లాలోని తాగునీటి పథకాలు నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ఆన్‌లైన్ టెండర్ల ప్రకియ పూరైంది. తాగునీటి పథకాల నిర్వహణకు సంబంధించి కొత్త గుత్తేదారులను నియమించనున్నారు. కొత్త గుత్తేదారులైనా సజావుగా నీటిని సరఫరా చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కౌతాళం



హాల్వి ఎస్‌ఏపీ పథకంలో నీటి తొట్టెలు

మంత్రాలయం నియోజకవర్గంలో కౌతాళం-6, హాల్వి-12, మంత్రాలయం-7, సాతనూరు-10, నెమలికల్లు-24, పెద్దకడబూరు-4 మొత్తం 63 గ్రామాల్లో 1.60 లక్షల మందికి తాగునీటిని అందించాలి. వారంలో మూడు రోజులు ఖచ్చితంగా సరఫరా చేయాలి. కానీ గత ఐదేళ్ల వైకాపా పాలనలో నిర్వహణను గాలికొదిలేయడంతో వారానికి ఒక రోజు కూడా తాగునీటిని అందించలేదు. కొన్ని గ్రామాలకు 15 రోజులకోసారి, ఇంకొన్నింటికి నెలకోసారి తాగునీటిని సరఫరా చేసిన దాఖలాలున్నాయి.

☛ హాల్వి సీపీడబ్ల్యూ పథకం నుంచి సుమారు 12 గ్రామాల్లో దాదాపు 40 వేల జనాభాకు నీరు సరఫరా చేయాలి. కానీ నిర్వహణ లోపంతో నిధులు సమయానికి చెల్లించకపోవడంతో కేవలం 6 నుంచి 8 గ్రామాలకు వారానికి ఒకసారి సరఫరా చేస్తున్నారు.

☛ కౌతాళం సీపీడబ్ల్యూ పథకం నుంచి ఆరు గ్రామాలకు వారంలో మూడు రోజులు సరఫరా చేయాల్సి ఉండగా వర్షాకాలంలో వారానికి రెండు సార్లు, వేసవిలో నెలకు 4 సార్లు మాత్రమే నీటిని సరఫరా చేశారు.



సాతనూరు ఎస్‌ఏపీ పథకం ఫిల్టర్ బెడ్లలో

కోసిగి మండలం సాతనూరు గ్రామ శివారులో ఉన్న ఎస్‌ఏపీ పథకం నుంచి సాతనూరు, అగసనూరు, చిర్తన్‌కల్, మూగలదొడ్డి, దుద్ది, కోసిగి, జంపాపురం, సజ్జలగూడెం, ఐరన్‌గల్ గ్రామాలకు పథకం నుంచి నీటిని శుద్ధి చేసి సరఫరా చేయాలి. గత ఐదేళ్ల నుంచి నాలుగు ఫిల్టర్ బెడ్లలో పాచి కూడా శుభ్రం చేయకుండా నీటిని సరఫరా చేస్తున్నారు. నీటిని శుద్ధి చేసే రెండు యంత్రాలు మరమ్మతులకు గురయ్యాయి. అధికారులు దీన్ని పట్టించుకోకుండా నీటిని అలాగే సరఫరా చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోసిగి



మంత్రాలయం తుంగభద్ర నదీ తీరంలో ఉన్న ఎస్‌ఏపీ ఫిల్టర్ బెడ్‌లో అడుగంటిన ఇసుక

మంత్రాలయం మండలం సూగూరు, దిబ్బనదొడ్డి ఎస్ఎస్ ట్యాంకులు ఉన్నాయి. నది నుంచి సూగూరు ఎస్ఎస్ ట్యాంక్‌కు నీటిని నింపి మైక్రో ఫిల్టర్ల ద్వారా నీటిని శుద్ధి చేసి మంత్రాలయం, సూగూరు, బూదూరు, వి.తిమ్మాపురం గ్రామాలకు సరఫరా చేయాలి. కానీ ఆయా గ్రామాలకు శుద్ధి చేయకుండా వదులుతున్నారు. మంత్రాలయం ఎస్‌ఏపీ ఫిల్టర్ స్కీం నుంచి నీటిని శుద్ధి చేసి చెట్నిహళ్లి, మంత్రాలయం, కల్లుదేవకుంట, చిలకలదోణ గ్రామాలకు తాగునీరు అందించాలి. కానీ నేరుగా ఫిల్టర్ బెడ్లలో నీరు నింపి సరఫరా చేస్తున్నారు. మంత్రాలయంలోని ఫిల్టర్ బెడ్లలో 5 అడుగుల ఇసుక ఉండాలి. కానీ 2 అడుగులు మాత్రమే ఉంది. ఇందులోని ఇసుక 15 ఏళ్లు మార్చలేదు. - న్యూస్‌టుడే, మంత్రాలయం

భార్యను చంపిన నిందితుడి అరెస్టు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలోని కులుమాల గ్రామంలో ఈ నెల 13న భార్యను చంపిన కురువ చిన్న పక్కీరప్పను అరెస్టు చేసినట్లు గోనెగండ్ల సీఐ గంగాధర్ బుధవారం తెలిపారు. గ్రామ శివారులో చిన్నమర్రివీడు రోడ్డు వద్ద నల్ల పోచమ్మ ఆలయం దగ్గర నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు వెల్లడించారు.

న్యాయం చేయాలని బైఠాయింపు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గుడేకల్‌లో తనకు న్యాయం చేయాలని రాజేశ్వరి అనే మహిళ పిల్లలతో కలిసి భర్త సురేష్ ఇంటి ఎదుట బుధవారం బైఠాయించింది. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ.. ఎనిమిది సంవత్సరాల కిందట సురేష్‌తో తనకు వివాహమైందని ముగ్గురు సంతానం ఉన్నారని చెప్పారు. కొంత కాలంగా భర్త పిల్లలను తనను పట్టించుకోవడం లేదని పుట్టినిల్లు ఎమ్మిగనూరులో తల్లిదండ్రులతో ఉంటున్నట్లు వెల్లడించారు. తనకు పిల్లలకు న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట బైఠాయించి కన్నీటి పర్యంతమయ్యారు. గతంలో పెద్దలు భర్తకు నచ్చజెప్పి భార్యను కాపురానికి పంపిన భర్త తమను పోషించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వగరూరు (మంత్రాలయం), న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో గాయపడిన హనుమన్న(42) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఎస్సై పరమేశ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని వగరూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన దస్తగిరి స్వామి ఉరుసు ఉత్సవానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి ఎమ్మిగనూరు మండలం కోటెకల్లు గ్రామానికి వెళ్తుండగా ఆస్పరి మండలానికి చెందిన పెద్దయ్య ద్విచక్ర వాహనంతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన హనుమన్నను ఎమ్మిగనూరు వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కర్నూలు
• కర్నూలు • పాణ్యం

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
కర్నూలు: 80085 52632
కర్నూలు గ్రామీణం: 85010 05408
ఓర్వకల్లు: 63004 66875

కర్నూలు నగర పాలక సంస్థ: **సమస్య:** కృష్ణానగర్‌లోని వీధుల్లో కాల్వలు శుభ్రం చేయాలి. కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయి. వర్షాలకు రహదారులపై మురుగు పారుతోంది. – అశోక్

సమస్య: నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో రహదారి గుంతలమయంగా మారింది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. – స్థానికులు

సమాధానం: సమస్యల్ని పరిశీలించి పరిష్కరిస్తాం. – నగర పాలక అధికారులు

వర్షమొస్తే.. రాకపోకలకు ఇబ్బందే

నగరంలోని రాక్‌వుడ్ స్కూల్, పాత ఎస్పీ బంగ్లా దగ్గర ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతంలో అనేకసార్లు గుంతలు ఏర్పడుతున్నాయి. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోంది. ఆ గుంతలను తాత్కాలికంగా ప్యాచ్ వర్క్ చేస్తున్నారు. మళ్లీ వర్షం వచ్చేసరికి తారు లేచిపోతూ గుంతలు దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారులను మరమ్మతులు చేయాలని ఆటోడ్రైవర్లు, వాహనదారులు నగర పాలక సంస్థ అధికారులను విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం



నిలిచిన నీరు.. సమస్యతీరు

గుత్తి రోడ్డుపై వంతెన సమీపంలో రహదారిపై వర్షం నీరు నిలిచింది. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై నీరు నిలుస్తోంది. దీంతో రాకపోకలు సాగించాలంటే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. – న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణం



టీజీవీ కళాక్షేత్రంలో సంస్మరణ సభ

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని టీజీవీ కళా క్షేత్రంలో బుధవారం రాత్రి ఆచార్య సొంబాబు సంస్మరణ సభ నిర్వహించారు. కవులు, రచయితలు ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహన్, రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, రచయితలు భార్గవ, పాణి, నాగేశ్వరాచారి, ఇనాయతుల్లా, మారుతీ పౌరోహితం, రత్నం, ఏసేపు, ఏపీరెడ్డి సుధీర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

తడకనపల్లె (కల్లూరు గ్రామీణం), న్యూస్‌టుడే: కల్లూరు మండలంలోని తడకనపల్లె గ్రామంలో హజరత్ మహబూబ్ సుభాని ఉరుసు మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఇందులో భాగంగా బుధవారం కిస్తీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు.

రూ.8 కోట్ల ఖర్చు.. దుకాణాలు ఖాళీ

నగర పాలక సంస్థ ఆదాయానికి గండి

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో నగర పాలక సంస్థ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. ప్రజా ప్రయోజనాలపై దృష్టి సారించలేదు. నగర పాలక ఆదాయ వనరులపై ఎక్కువ దృష్టి సారించామని చెబుతూ రూ.కోట్లు దుర్వినియోగం చేశారు. దీంతోపాటు సుందరీకరణ పేరుతో నిధులను విచ్చలవిడిగా ఖర్చు చేశారు. నగర పాలక సాధారణ నిధులతో వెంకటరమణ కాలనీలో ఆధునిక దుకాణ సముదాయం (కర్నూలు ప్రైడ్ ప్లాజా)ను నిర్మించారు. అందులోని దుకాణాలకు టెండర్ నిర్వహించగా ఎవరూ ముందుకు రాలేదు.



వెంకటరమణ కాలనీలోని దుకాణ సముదాయం

నగర పాలక ఆధునిక దుకాణ సముదాయం నిర్మాణానికి 2022 నవంబరు 4న శ్రీకారం చుట్టారు. నగర పాలక సాధారణ నిధుల రూ.8 కోట్లతో ఈ వాణిజ్య సముదాయాన్ని నిర్మించారు. ఇందులో రెండు బ్లాకులుగా చేసి 58 దుకాణాలను కట్టారు. వాటిని కేటాయించేందుకు రెండుసార్లు వేలం నిర్వహించినా ఆశించిన స్పందన రాలేదు. 2023 డిసెంబరులో మొదటిసారి, 2024 ఫిబ్రవరిలో రెండోసారి వేలం నిర్వహించారు. అధికారులు ఇలా రెండుసార్లు వేలం వేసినా కేవలం 20 దుకాణాలను మాత్రమే దక్కించుకున్నారు. ఇంకా 38 మిగిలిపోయాయి. వీటిని దక్కించుకోవడానికి ఎవరూ ఆసక్తి కనబర్చడం లేదు. దుకాణాలను దక్కించుకున్న యజమానులు సైతం ఇంకా వాటిని ప్రారంభించలేదు.

స్వార్థప్రయోజనాల కోసం..

వైకాపా ప్రభుత్వ హయాంలో నగర పాలక అధికారులు ప్రజాప్రయోజనాలను పక్కనబెట్టారు. కాలనీల్లో పనులను కల్పించడంకూడా నిధులను కేటాయించకుండా చదాని సంకోచించారు. నగర పాలక సంస్థకు ఆదాయం వచ్చే నిర్మాణాలు చేపట్టినా, ప్రస్తుతం అవి ఆశించినమేర ఫలితాన్నివ్వడం లేదు. అప్పట్లో వెంకటరమణ కాలనీలో నగర పాలక ఆధునిక దుకాణ సముదాయం నిర్మించవద్దని ప్రజల నుంచి సైతం వ్యతిరేకత వచ్చింది. అయినా అప్పటి అధికారులు పాలకుల మాటలు విని ఇష్టానుసారంగా వ్యవహరించారు. కొందరి రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం ఈ కాంప్లెక్స్ నిర్మాణానికి తెర లేపారు. అందుకు అధికారులు సైతం వత్తాసు పలికారు. రూ.8 కోట్లతో సముదాయాన్ని నిర్మిస్తే ప్రస్తుతం 38 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. రూ.కోట్లు ఖర్చు చేసినా ఇటు ప్రజలకుగానీ, నగర పాలక సంస్థకుగానీ ఎటువంటి ప్రయోజనం చేకూరకపోవడం గమనార్హం. ఈ నిధులతో కనీసం ప్రజలకు అవసరమయ్యే పనులు చేసినా బాగుండని నగరవాసులు చర్చించుకుంటున్నారు.

ఇంకా నిర్మాణ పనులు

వెంకటరమణ కాలనీలోని నగర పాలక ఆధునిక దుకాణ సముదాయం వద్ద పలు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. పనులు పూర్తిస్థాయిలో చేయలేదు. చిన్నచిన్న పనులు చేయాల్సి ఉన్నా వదిలేశారు. దుకాణాలు దక్కించుకున్నవారు సైతం ఇంకా ప్రారంభించకపోవడం గమనార్హం.

మార్గబిలం.. ప్రమాదకరం



నగరంలోని అశోక్‌నగర్ ఆటో స్టాండ్ దగ్గర మార్గబిలం ప్రమాదకరంగా మారింది. కల్వర్టుపై ఏర్పాటు చేసిన మార్గబిలం సగం విరిగిపోయింది. వాహనచోదకులు, ఆటో కార్మికులు ఇనుప కడ్డీలు విరిగిపోయిన ప్రాంతంలో రాళ్లను అడ్డంగా పెట్టారు. కొన్ని రోజులుగా నడిరోడ్డుపై మార్గబిలం ప్రమాదకరంగా ఉన్నా నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆటో కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు స్పందించి ఇనుప కడ్డీలు తొలగించి కొత్త మూత ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

పాదబాట ధ్వంసం



కర్నూలు నగరంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో కేసీ కాల్వపై వంతెన మీద ఓవైపు పాదబాట ధ్వంసమైంది. గత కొన్ని రోజులుగా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు నగర పాలక సంస్థ

రాష్ట్ర స్థాయి స్కేటింగ్‌లో రాణించాలి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాణించి పతకాలతో తిరిగి రావాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. నగరంలోని డీఎస్‌ఏ మైదానంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల పేర్లను బుధవారం ప్రకటించారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 18 నుంచి కాకినాడలోని రాజాస్ ట్యాంకులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అండర్-11 బాలికల విభాగంలో సోయాల నింజిష, మాన్విశ్రీ, శ్రీ, హ్రితికరెడ్డి, బాలుర విభాగంలో శ్రీతీక్ చౌదరి, ప్రిన్స్‌లియో, హితేష్, అండర్-14 బాలికల విభాగంలో సాహితి, ఇక్షితరెడ్డి, బాలుర విభాగంలో జయంతిరెడ్డి, మొహమ్మద్ రయాన్, అండర్-17 విభాగంలో శామ్యూల్ రెనాల్డ్‌లను ఎంపిక చేశారు. వీరిని రోలర్ స్కేటింగ్ సంఘం ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్, సంయుక్త కార్యదర్శి పునిత చౌదరి, కోశాధికారి అబూబాకర్ అభినందించారు.



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో సంఘం ప్రతినిధులు

నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఏపీ ఐటీఐ, డీఎల్‌టీసీ స్టాఫ్ అసోసియేషన్ కర్నూలు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి రామయ్య పేర్కొన్నారు. నగరంలోని బి.తాండ్రపాడు ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాలలో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా ప్రకాశ్‌రావు, ఉపాధ్యక్షులుగా హరీశ్‌రావు, లక్ష్మీదేవి, కార్యదర్శిగా శిరీషా, సంయుక్త కార్యదర్శిగా అబ్దుల్ నబీరసూల్, కోశాధికారిగా సూర్యశేఖర్‌రెడ్డితో పాటు నలుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం వారికి నియామక పత్రాలను అందజేశారు.



నియామక పత్రాలతో నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్‌గా పీఎల్ భాస్కర్

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: కడపలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్‌గా పని చేస్తున్న పీఎల్ భాస్కర్‌ను కర్నూలు జిల్లా డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం జీవో 314 విడుదల చేశారు. ఇక్కడ పని చేస్తున్న హరినాథ్ బాబును ఎక్కడ అనేది రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. పది రోజుల క్రితమే హరినాథ్‌బాబు కర్నూలు డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అదనపు బాధ్యతలు చేపడుతున్న పీఎల్ భాస్కర్ నాలుగేళ్ల కిందట డోన్ డీఎంగా పని చేశారు.

అప్రమత్తత అవసరం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: భారీ వర్షాల దృష్ట్యా గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయడం, పైపుల్లో లీకేజీలు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవోఆర్డీలు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండు చేస్తూ విజయవాడలో ఈ నెల 18న నిర్వహించనున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్మిక సదస్సును విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమైక్య నగర అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, సురేష్‌నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని గోకారి ఆటో స్టాండు వద్ద సదస్సుకు సంబంధించిన గోడపత్రాలను వారు విడుదల చేశారు.

☛ ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈ నెల 31న కర్నూలు జిల్లాలోని అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించాలని సంఘం జిల్లా కార్యదర్శి మునెప్ప పేర్కొన్నారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో నాయకులు వెంకటేశ్ అధ్యక్షతన నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం జెండాలు ఆవిష్కరించి, సభలు, ప్రదర్శనలు నిర్వహించాలన్నారు.

☛ 14 రాష్ట్రాల్లో సంఘటిత, అసంఘటిత రంగాల్లో పని చేస్తున్న టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ విలీన సభ అక్టోబరు 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు తిరుపాల్ తెలిపారు. బుధవారం నగరంలోని ఐఎఫ్‌టీయూ ఆటో స్టాండు వద్ద విలీన సభకు సంబంధించిన గోడపత్రాలు విడుదల చేసినట్లు తెలిపారు.

మార్కెట్‌లో బురద.. కొనుగోళ్లకు వ్యథా

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లోని కూరగాయల మార్కెట్ కంపు కొడుతోంది. చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. రైతులు, వ్యాపారులు, కాయగూరలు కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు, చిరు వ్యాపారులు బురదలోనే తిరగాల్సి పరిస్థితి నెలకొంది. మార్కెట్‌ను వారం, పది రోజులైనా శుభ్రం చేయడం లేదేమో అన్నట్లుగా అపరిశుభ్రంగా ఉంటోంది. కూరగాయల మార్కెట్‌లో బురద పేరుకుపోయింది. మురుగు కాల్వల వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షం నీరు నిలుస్తోంది. వ్యాపారులు బురదలోనే కూర్చొని విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో మొత్తం వర్షపు నీరు ప్రధాన రహదారులపై నిలిచిపోయింది. కూరగాయల మార్కెట్‌కు రోజుకు వెయ్యి మందికిపైగా వినియోగదారులు, చిరు వ్యాపారులు కూరగాయల క్రయవిక్రయాలు చేస్తుంటారు. పరిశుభ్ర వాతావరణంలో ఉండాల్సిన మార్కెట్ కంపు కొడుతోంది. కూరగాయల మార్కెట్ నుంచి ఏటా రూ.లక్షల ఆదాయం వస్తున్నా మౌలిక సదుపాయాలు, వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఏటా రూ.6 కోట్లకుపైగా ఆదాయం సమకూరుతోంది. మార్కెట్ యార్డును శుభ్రం చేసేందుకు ఏర్పాటు చేసిన పారిశుద్ధ్య ఏజెన్సీ వారానికి ఒకసారి కూడా శుభ్రం చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ఎక్కడ పడితే అక్కడ కాయగూరల వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు చొరవ తీసుకొని మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచాలని వినియోగదారులు కోరుతున్నారు.



అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: ఓర్వకల్లులోని చౌడేశ్వరి దేవి అమ్మవారికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, తెదేపా సీనియర్ నాయకుడు గౌరు వెంకటరెడ్డి బుధవారం పట్టువస్త్రాలను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో జరిగే ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని ఆమె అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట తెదేపా నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు రాంమోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

పారిశుద్ధ్యానికి చర్యలు

కర్నూలు నగర పాలక సంస్థ, న్యూస్‌టుడే: వర్షాల నేపథ్యంలో నగరంలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నామని నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. బుధవారం ఆయన కర్నూలు నగరంలోని కృష్ణానగర్, ఆదిత్య నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

తెగుళ్ల నివారణపై అవగాహన ఉండాలి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: రైతులు పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి సుధాకర్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని బ్రాహ్మణపల్లె, శకునాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పొగాకు, కంది పంటలను పరిశీలించారు. వర్షం కారణంగా వచ్చే తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలు చేశారు.



పొగాకు పంట పరిశీలిస్తున్న అధికారులు

నాన్ క్యాడర్ ఎస్పీకి సత్కారం



సన్మానం పొందిన నాగబాబుతో జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ అదనపు ఎస్పీ నాగబాబు నాన్ క్యాడర్ ఎస్పీగా పదోన్నతి పొంది ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌కు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన్ని ఎస్పీ జి.బిందుమాధవ్ ఇతర అధికారులు సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సదరన్ రీజియన్ హోంగార్డు దళాధిపతి మహేశ్‌కుమార్, డీఎస్పీలు శ్రీనివాసాచారి, శ్రీనివాసరావు, కృష్ణమోహన్, సీఐలు, ఆర్ఐ పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా కాలనీలు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: నగరంలోని ఎన్‌సీసీ నగర్ నుంచి రామచంద్ర నగర్ మీదుగా నంద్యాల రోడ్డును కలుపుతూ 2 కి.మీ. వరకు ప్రధాన రహదారి నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణంతో రహదారికి ఇరువైపులా పలు కాలనీలు విస్తరించాయి. ఇక్కడ శంకుస్థాపనల శిలా ఫలాకాలు కనిపిస్తాయి, కానీ అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ప్రధాన రహదారికి ఇరువైపులా మట్టిదిబ్బలు, దుర్వాసన వెదజెల్లే పనికిరాని దుస్తులు వేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరో డంపింగ్ యార్డులా తయారైంది. ఈ ప్రాంతాల్లో పార్థసారథినగర్, ఎఫ్‌సీఐ, ఎఫ్‌సీఐ కాలనీ-2, శ్రీశైలం ఎండోమెంట్, అంబేడ్కర్‌నగర్, లేపాక్షినగర్‌తోపాటు మరో 10 కాలనీలున్నాయి. సుమారు 5 వేల మందికిపైగా నివసిస్తున్నారు. ఈ కాలనీల్లో అంతర్గత రహదారి నిర్మాణం పనులు నత్తనడక సాగుతోంది. పనుల కోసం కంకర ఎక్కడ పడితే అక్కడే వేశారు. కొన్ని ప్రాంతాల్లో రహదారులన్నీ బురదగా మారాయి. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం కురిసిన వర్షానికి కొన్ని ప్రాంతాల్లోని రహదారుల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది.



ఎఫ్‌సీఐ కాలనీ-2లో గుంతలతో రహదారి



బురదగా మారిన శ్రీశైలం ఎండోమెంట్ కాలనీ